



నెల్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న నేతలు, కార్మికులు

కంటైనర్ టెర్మినల్ తరలింపు దారుణం

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు
- నెల్లూరు నగరంలో భారీ ప్రదర్శన

నెల్లూరు (వైద్యం)మార్చి 1 : కృష్ణపట్నం నుంచి కంటైనర్ టెర్మినల్ తరలింపు దారుణమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహారావు ఆందోళన వ్యక్తం చేశారు. కంటైనర్ టెర్మినల్ తరలింపునకు వ్యతిరేకిస్తూ శుక్రవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ నుంచి ఆర్డీసీ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టును ఏర్పాటు చేసింది జిల్లా అభివృద్ధి కోసమేనని, అదానీ అభివృద్ధి కోసం కోసం కాదన్నారు. అదానీ తన నియంత్రణలోని థర్మల్ విద్యుత్ స్టేషన్ అభివృద్ధి కోసం కృష్ణపట్నం పోర్టును బొగ్గు మయంగా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తన పోర్టుల అభివృద్ధి కోసం కృష్ణపట్నం పోర్టును పావుగా వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అదానీ సంస్థ దుష్టపన్నాగాలను నియంత్రించాలన్నారు. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలు యథావిధిగా సాగేలా చూడాలని డిమాండ్ ఆయన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లావాసులకు ఎస్పీ హెచ్చరిక




నెల్లూరు (క్రైం), మార్చి 1 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి ప్రజలకు సూచించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీ సమయాల్లో అదనపు అదనపు ఆదాయం సంపాదించేందుకు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేద్దామనుకునే వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడు తున్నారని చెప్పారు. క్రిప్టో కరెన్సీ, రిమోట్ యాక్సెస్ ఫ్రాడ్ పేరిట ప్రజలను దోచు కుంటున్నట్లు తెలిపారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా అపరచిత వ్యక్తులు స్నేహితులుగా మారి విదేశాల నుంచి బహుమతులు పంపుతున్నామంటూ నమ్మించి రూ.లక్షలు దోచేస్తున్నారన్నారు. జిల్లాలో ప్రీపెయిడ్ టాస్కల ఫ్రాడ్ ద్వారా రూ.13 లక్షలు, నకిలీ వెబ్‌సైట్స్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట రూ.10 లక్షలు, యూట్యూబ్‌లో వీడియోలకు లైక్స్, రివ్యూల ద్వారా అధిక నగదు సంపాదించవచ్చని రూ.9.5 లక్షలు, విమాన టికెట్స్ బుక్‌చేస్తే అధిక నగదు సంపాదించవచ్చని రూ.3.5 లక్షలు చొప్పున సైబర్ నేరగాళ్లు కాజేశారని ఫిర్యాదులు అందాయన్నారు. సాంకేతికత ఆధారంగా ఈ కేసులను దర్యాప్తు చేస్తున్నామ న్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు సైబర్‌మిత్ర వాట్సప్ నెం. 9121211100, 1930, ఎన్సీఆర్‌పీ పోర్టల్ సైబర్ క్రైమ్.జీవోవి.ఇన్‌లకు, స్థానిక పోలీ సులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్మీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) : భారత ఆర్మీలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో కోరారు. గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయ పరిధిలోని నెల్లూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, కర్నూలు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని అర్హులైన యువకులు ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల నకిశీలన అనంతరం ఏప్రిల్ 22న కామన్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఇంటర్ విద్యార్హతపై అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్ (ఆల్‌ఆమ్స్), 8, 10 తరగతుల విద్యార్హతపై అగ్నివీర్ ట్రేడ్స్‌మాన్ (ఆల్ ఆమ్స్) ఉద్యోగాలకు పదిహేడన్నర సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయసుగల అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు.

నెల్లూరు వైసీపీ అభ్యర్థిగా విజయసాయి



నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిని ఖరారు చేశారు. శుక్రవారం ఆ పార్టీ అధిష్ఠానం విడుదల చేసిన 9వ జాబితాలో విజయసాయి పేరు వెలువడింది. కాగా, ముత్తుకూరు మండలం తాళ్లపూడి విజయసాయి స్వగ్రామమైనా ఆయన బాల్యం, విద్యాభ్యాసం అంతా చెన్నైలో సాగింది. ఆడిటర్‌గా జగన్‌కు పరిచయ మైన విజయసాయి ఆ తరువాతి కాలంలో జగన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు ఆర్థిక సలహాదారుగా పని చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ ఆడిటర్‌గా వ్యవహరించారు. తదనంతర కాలంలో వైసీపీలో కీలక నేతగా మారారు. 2016 నుంచి ఇప్పటివరకు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇదివరకు నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రాజీనామాతో వైసీపీ పెద్దలు అభ్యర్థి కోసం వెతుకులాడుకోవాల్సి వచ్చింది. కొద్దిరోజులుగా రాజ్యసభ సభ్యుడు అయోధ్యరామిరెడ్డి పేరు ప్రచారంలోకి వచ్చింది. అయితే, అనూహ్యంగా విజయ సాయి రెడ్డి పేరును శుక్రవారం ప్రకటించారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఇద్దరు రాజ్యసభ సభ్యులు పోటీ పడనుండటం విశేషం.

సోమశిలలో 16.438 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శుక్రవారం నాటికి జలాశయంలో 16.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 450 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



రూపుదిద్దుకున్న సభాప్రాంగణం



ఏర్పాట్లపై టీడీపీ ముఖ్యనాయకుల మంతనాలు

నేడు చంద్రబాబు రాక

- నెల్లూరులో విస్తృత ఏర్పాట్లు
- పసుపుమయంగా మారిన గొలగమూడి రోడ్డు
- వీపీఆర్ దంపతులతోపాటు భారీగా టీడీపీలో చేరనున్న వైసీపీ శ్రేణులు

నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శనివారం నెల్లూరులో పర్యటించనున్నారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలతోపాటు అధికార వైసీపీకి చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరనున్నారు. ఈ సందర్భంగా గొలగమూడి రహదారిలోని వీపీఆర్ కన్వెన్షన్‌లో భారీ ఏర్పాటు చేశారు. వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తదితరులు శుక్రవారం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● 11 గంటలకు చంద్రబాబు రాక

శనివారం ఉదయం 9.50 గంటలకు చంద్రబాబు బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు. 11.50 గంటలకు కనుపర్తిపాడు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుని, రోడ్డుమార్గాన 12 గంటలకు వీపీఆర్ కన్వెన్షన్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు పార్టీలో చేరికలు, సభ ఉంటుంది. అనంతరం 2.30 గంటలకు పల్నాడు జిల్లాకు బయలుదేరుతారు.

భారీగా చేరికలు

వీపీఆర్ దంపతులతోపాటు వైసీపీకి చెందిన పలువురు నాయ కులు టీడీపీలో చేరనున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరనున్నవారిలో ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, పార్టీల మండల అధ్యక్షులు, కార్పొ రేటర్లు, కౌన్సిలర్లు ఇలా స్థాయి కలిగిన వారు వందల సంఖ్యలో తేలారు. పార్టీలో చేరేవారి జాబితాను టీడీపీ జోనల్ ఇన్‌చార్జి, ఎమ్మె ల్సీ రాంభూపాల్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమ ఏర్పాట్లు, నిర్వహ ణలపై రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర డాక్టర్ల సంఘం అధ్యక్షుడు జెడ్.శివ ప్రసాద్‌లు శుక్రవారం మధ్యాహ్నం వీపీఆర్‌తో భేటీ అయ్యా రు. పార్టీలో చేరేవారి సంఖ్య ఎక్కువగా ఉండటం, సాయంత్రానికి పల్నా డు జిల్లాలో జరిగే కార్యక్రమానికి చంద్రబాబు హాజరు కావా ల్సి ఉండటంతో జాబితాను కుదించాలని నిర్ణయించుకున్నారు. వీపీఆర్ దంపతులతోపాటు 50 మంది ముఖ్య నాయకులకు చంద్ర బాబు చేతుల మీదుగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించాలని, మిగిలిన వారిని మరో కార్యక్రమం ఏర్పాటు చేసి పార్టీలో చేర్చు కోవాలని నిర్ణయించుకున్నారు.

● విస్తృత ఏర్పాట్లు

చంద్రబాబు పాల్గొనే వీపీఆర్ కన్వెన్షన్‌ను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కన్వెన్షన్ హాలులో మూడు గ్యాలరీలు ఏర్పాటుచేసి 6వేల మందికిపైగా కూర్చోవడానికి వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరం నుంచి వీపీఆర్ కన్వెన్షన్ వరకు దారిపొడవునా చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాగా, చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి నారాయణ ముఖ్యనాయకులతో సమీక్షించారు. పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి, మామిడాల మధు, తదితరులు పాల్గొన్నారు.



గొలగమూడి రోడ్డులో వెలసిన ఫ్లెక్సీలు

ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో..

నేను సహకరించను!

- 'బుర్రా'కు తేల్చి చెప్పిన ఎమ్మెల్సీ తూమాటి
- ఇదే విషయం వైసీపీ అధిష్ఠానానికి చేరవేత



బుర్రా మధుసూదన్



తూమాటి మాధవరావు

కందుకూరు, మార్చి 1 : వైసీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. సహకరించలేనని ఎమ్మెల్యే మహీధరరెడ్డి స్పష్టం చేసిన మరుసటిరోజే ఎమ్మెల్సీ కూడా తాను బుర్రాతో కలిసి పని చేయలేనని పార్టీ అధిష్ఠానానికి చెప్పినట్లు సమాచారం. బుర్రా మధు శుక్రవారం మాధవరావుకు ఫోన్ చేసి కందుకూరు రావాలని ఆహ్వానించగా ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. 'గతంలో కనిగిరి నియోజకవర్గానికి నన్ను సీఎం జగన్ పరిశీలకుడిగా నియమిస్తే అడ్డుకోవడమేగాక మా నియోజకవర్గంలో మీ సామాజికవర్గం వారు వస్తే ఇబ్బంది అని చెప్పిన నీకు ఇప్పుడు నా అవసరం వచ్చిందా? నీకు నా సహకారం ఎట్టిపరిస్థితుల్లో ఉండద'ని మాధవరావు స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. జగన్‌తో సన్నిహిత సంబంధాలున్న ఎమ్మెల్సీ మాధవరావు నుంచి ఈ సమాధానాన్ని ఊహించని బుర్రా 'అదేంటి జగన్ ఆదేశాలు కదా మనమంతా కలిసి పని చేయాలి.' అని అనగానే అప్పట్లో కనిగిరికి తనను పరిశీలకుడిగా నియమించింది కూడా జగనే కదా మరి ఆ రోజు తనను రావద్దని ఎలా చెప్పావని ప్రశ్నించిన ఎమ్మెల్సీ 'నీవు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో నేనైతే సహకరించబోన'ని స్పష్టం చేయడం విశేషం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నుంచి ఒకే సమాధానం రావటమే గాక బుర్రాకు ఇన్చార్జి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ కొన్నేళ్లుగా అసంతృప్త కూటమిగా గుర్తింపు పొందిన కొందరు వైసీపీ నేతలు కూడా విజయసాయిని కలిసి బుర్రాను మార్చాలని కోరినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా శుక్రవారం బుర్రా మధుసూదన్ యాదవ్‌ను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బుర్రాను నాయకులు, కార్యకర్తలతోపాటు కందుకూరు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అలాగే కందుకూరు సబ్ కలెక్టరు విద్యాధరిని బుర్రా కలిసి పరిచయం చేసుకున్నారు. సాయంత్రం పట్టణంలోని వైసీపీకి చెందిన ప్రముఖుల నివాసాలకు వెళ్లి వారి మద్దతు కోరారు.

● గుంభనంగా మహీధరరెడ్డి

మరోవైపు ఎమ్మెల్యే మహీధరరెడ్డి తన భవిష్యత్తు కార్యాచరణపై గుంభనంగానే వ్యవహరిస్తున్నారు. శుక్రవారం తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేస్తారన్న ఊహాగానాలు వచ్చినా ఎలాంటి సమావేశం జరగలేదు. ఉదయం ఆయన అధికారిక కార్యక్రమాలలో బిజీగా ఉండగా సాయంత్రం కార్యాలయంలో ఉన్న సమయంలో పెద్దసంఖ్యలో ఆయన అనుచరులు, అభిమానులు వచ్చి కలిశారు. మన పయనమెటు అన్న వారి ప్రశ్నలకు ఎలాంటి సంకేతాలు ఇవ్వకపోవటం విశేషం.

నెలరోజుల్లోనే జేసీ బదిలీ

నూతన జేసీగా సేతు మాధవన్ ● ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవో ఆదర్శ్ రాజేంద్రన్

నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవోగా ఆయన్ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జేసీగా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సేతు మాధవన్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయన ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈవోగా పని చేస్తు న్నారు. కాగా జిల్లాలో బాధ్యతలు తీసుకొన్న నెల రోజుల వ్యవధిలోనే ఆదర్శ్ రాజేంద్రన్ బదిలీ కావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత కారణాలతో కొన్ని రోజులుగా ఆయన సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ జేసీగా నెల్లూరు కార్పొరేషన్ కమిష నర్ వికాస్ మర్మత్ వ్యవహరిస్తు న్నారు. నెల రోజుల వ్యవధిలో మూడో జేసీ జిల్లాలో బాధ్యతలు చేపట్టనుండటం గమనార్హం. జనవరి నెలాఖరున రోణంకి కూర్మ నాథ్‌ను బదిలీ చేయగా ఆయన స్థానంలో వచ్చిన ఆదర్శ్ రాజేంద్రన్ తాజాగా బదిలీ అయ్యారు.



ప్రమాదం జరిగింది ఈ నౌకలోనే..

అంతులేని విషాద ఘటన ఇది. 'డ్యూటీకి వెళ్లొస్తానమ్మా..' అని వెళ్లిన తండ్రి శవమై ఇంటికి చేరడంతో ఆ ముగ్గురు ఆడబిడ్డలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మూడేళ్ల క్రితం తల్లిని, ఇప్పుడు తండ్రిని తీసుకెళ్లిపోయావే దేవుడా ఇక తమకు దిక్కెరంటూ వెక్కి వెక్కి ఏడుస్తున్న ఆ ముగ్గుర్ని ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. అలాగే ఆదివారం పెళ్లిపీటల మీద కూర్చోవాల్సిన వరుడు తిరిగిరాని లోకానికి వెళ్లిపోయాడని తెలిసి ఇరుకుటుంబాలు కన్నీటి పర్యంతమయ్యాయి. ఉదయం వరకు పెళ్లిపనుల్లో ఉన్న కుమారుడు సాయంత్రం శవమై ఇంటికి చేరడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన అంతాఇంతా కాదు. శుక్రవారం కృష్ణపట్నం పోర్టులోని ఓ నౌకలో శుభ్రం చేసేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు ఊపిరాడక మృత్యువాత పడ్డారు.

అనుకోని ఘటన.. మిగిల్చిన ఆవేదన!

- కృష్ణపట్నం పోర్టులో ఇద్దరు యువకుల మృతి

బొగ్గు నౌకలో ఊపిరాడక దుర్మరణం

బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం

ముత్తుకూరు, మార్చి 1 : ముత్తుకూరులోని అరుంధతివాడకు చెందిన కోడూరు కదిరి వేలు (33), ఇందిరమ్మ గిరిజన కాలనీకి చెందిన కవరగిరి యశ్వంత్ (22) అదానీ కృష్ణపట్నం నౌకాశ్రయంలో విధులు నిర్వహిస్తున్నారు. పోర్టులోని బెర్త్ నెం.6లో లంగరు వేసిన రూయినింగ్-21 నౌకలో బొగ్గు అన్‌లోడింగ్ జరిగింది. శుక్రవారం నౌకలోని 6వ నెంబరు హ్యాచ్‌ను శుభ్రం చేయాల్సి ఉంది. అయితే, పొరపాటున కదిరివేలు, యశ్వంత్‌లు 5వ నెంబరు హ్యాచ్‌లోకి దిగారు. మూసి ఉన్న ఈ హ్యాచ్‌లో విషవాయువుల తీవ్రతకు వారిద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పరిస్థితి గమనించిన అక్కడున్న సిబ్బంది వెంటనే వారిద్దరినీ బయటకు తీసుకువచ్చేసరికే ఊపిరాడక మృతి చెందారు. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, ఎస్ఐ శివనాంచారయ్య తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● రేపు పెళ్లి అంతలోనే..



మృతుడు యశ్వంత్‌కు ఆదివారం పెళ్లి జరగనుంది. సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటూ సంతోషంగా ఉన్న కుటుంబం విషాదంలో మునిగిపోయింది. శుక్రవా రం ఉదయం 11గంటల వరకు ఎంతో సంతోషంగా ఉన్న కుటుంబ సభ్యులు యశ్వంత్ మృతి విషయం తెలిసి నిర్ఘాంతపోయింది. రెండే రెండు రోజుల్లో పెళ్లి కొడుకుగా పీటల మీద కూర్చోవాల్సిన యశ్వంత్ ఇక లేడు అని తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సరైన నిర్వహణ లేకనే తమ కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

● ఆడపిల్లలను అనాథలను చేసి...



మరో మృతుడు కోడూరు కదిరివేలు భార్య సారక్క మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతువాత పడింది. దీంతో తన ముగ్గురు కుమార్తెలు భావన (10), గౌతమి (6), పల్లవి (4)లను అన్నీ తానే పెంచుతున్నాడు. తండ్రి మృతి చెందాడని తెలియడంతో ఆ బాలికలు కన్నీటిపర్యంతమయ్యారు. బోరున విలపిస్తున్న వారిని చూసిన చుట్టుపక్కల వారు సైతం కంటతడి పెట్టుకున్నారు. ప్రస్తుతం వీరికి అమ్మమ్మ, నానమ్మలే దిక్కుగా మారారు. తల్లిదండ్రులు కోల్పోయిన ఆ బాలికల భవిష్యత్తుకు తగిన భద్రత కల్పించాలని పోర్టు యాజమాన్యాన్ని స్థానికులు కోరుతున్నారు.

తొలిరోజు ప్రశాంతం!

- ఇంటర్ పరీక్షల ప్రారంభం
- 27,220 మందికి 26,374 మంది విద్యార్థుల హాజరు



విజయోస్తు : ఆలయంలో పూజలు చేసుకుంటున్న విద్యార్థులు



ఇదిగో నా నెంబర్ ఇక్కడుంది!

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), మార్చి 1 : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 81 పరీక్ష కేంద్రాల్లో తొలిరోజున ప్రథమ సంవత్సర విద్యార్థులు తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఒకేషనల్ సబ్జెక్టులను రాశారు. ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమవగా తొలిరోజు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు 7.30 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. నిర్ణీత గడువు తర్వాత నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించ లేదు. జనరల్ విభాగంలో 25,930 మందికిగాను 25,249 మంది విద్యార్థులు హాజరయ్యారు. 681 మంది గైర్హాజరయ్యారు. వృత్తివిద్యా కోర్సులకు సంబంధించి 1,290 మందికి 1,125 మంది పరీక్ష రాశారు. 165 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 27,220 మందికి 26,374 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

● అధికారుల పరిశీలన

ఇంటర్ పరీక్షలను ఆర్ఐవో ఏ శ్రీనివాసులు నగరంలోని పలు కేంద్రాలను పరిశీలించారు. డీవీఈవో నాలుగు, డీఈసీ సభ్యులు 31 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. తొలిరోజు పరీక్షల్లో ఎవరూ మాల్ ప్రాక్టీసుకు పాల్పడలేదని ఆర్ఐవో తెలిపారు. అలాగే ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి నగరంలోని డీకేడబ్ల్యూ, సర్వోదయ కళాశాలలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద తీసుకున్న భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పనితీరు, పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 సీఆర్పీసీ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండకూడదన్నారు. ప్రశ్న పత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయడానికి తగిన ఎస్కార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరగడానికి పోలీస్ శాఖ తరపున అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా సంబంధిత పోలీసు అధికారులకు తగు సూచనలు చేశామన్నారు.



పదా.. టైం అయిపోతోంది!



కనిగిరిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

● నేడు సీనియర్లకు..

ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 81 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా, జనరల్ విభాగంలో 24,243 మంది, వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులు 1414 మంది హాజరు కానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది.



జాగ్రత్తగా ఉండండి : నెల్లూరులో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సూచనలు



ఆత్మకూరు : రేకుల షెడ్డులో ఫ్యాన్ లేకుండా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తిప్పిరెడ్డిపల్లిలో అక్రమ తవ్వకాలపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న తిప్పిరెడ్డిపల్లి దళితులు

సైదాపురం : తిప్పిరెడ్డిపల్లి దళిత వాడలో సమీపంలో అక్రమంగా చేపట్టిన తెల్లరాయి తవ్వకాలపై శుక్రవారం గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల్లో నివాస గృహాల పక్కనే క్వారీలో అక్రమంగా తెల్లరాయి హిటాచీ మిషన్‌తో తొవ్వకాలు చేయడం సరికాదన్నారు. మిషన్ శబ్దాలకు రాత్రి సమయంలో జనాలు జాగరణ కాయాల్సి వస్తుందన్నారు. బ్లాస్టింగ్‌లతో భయాందోళనకు చెందుతున్నట్లు వాపోయారు. భారీగా గుంతలు తీయడం వల్ల మూగ జీవాలు గోతుల్లోపడి ప్రమాదాలకు గురవుతున్నాయని చెప్పారు. 20అడుగల దూరంలో నివాసాల పక్కనే తెల్లరాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండను తవ్వి ఎలుకను పట్టారు !

- రూ. 6 కోట్లు పనులు, అక్రమాలుగా తేల్చింది రూ. 3లక్షలు
- అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

కొడవలూరు మార్చి 1 : మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకోగా కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా అధికారుల తీరు ఉందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పీడీ బీ వెంకట్రావు పాల్గొన్నారు. 2022 -2023 పనులకు సంబంధించి రూ. 6,30,88,665 నిధులతో జరిగిన పనులకు గాను కేవలం రూ. 3,61,612 అక్రమాలు జరిగినట్లు తేల్చారు. అదేవిధంగా తలమంచి గ్రామంలో ఉపాధి హామీ కింద ఈ ఏడాది 2022-23 గాను రూ. 12,8000 పనులు జరిగాయి. అయితే ఈ గ్రామంలో పెద్దఎత్తున అవినీతి జరిగింది. సామాజిక తనిఖీలో రూ. 3,47,697 అవినీతి జరిగినట్లు తేల్చారు. దీంతో గ్రామస్థులు అవినీతిపై నిగ్గు తేల్చాలని రూ. 3 లక్షల కన్నా పైన అవినీతి జరిగిందని, పూర్తి స్థాయిలో విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో గ్రామస్థులు, ఫీల్డ్ అసిస్టెంట్ మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో పీడీ జోక్యం చేసుకునకి న్యాయంచేస్తానని హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవినీతికి కేరాఫ్ తలమంచి

మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో తలమంచి గ్రామం అవినీతికి కేరాఫ్‌గా నిలిచిందని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు జొన్న శివకుమార్ ధ్వజమెత్తారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో 2023-22 ఉపాధి హామీ పనుల్లో భారీగా అవినీతి జరిగిందన్నారు. తలమంచి గ్రామంలో ఏఒక్క కాలువలో ఉపాధి పనులు చేసిన దాఖలాలు లేవని, కానీ లెక్కల్లో పనులు చేసినట్లు చూపి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటం ఆగదన్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నాతాధికారి దృష్టికి తీసుకెతామన్నారు. ఆయన వెంట గ్రామస్థులు, తదితరులున్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించండి : ఆర్డీవో



శివరాత్రి బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్డీవో మాలోల తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) : ఈనెల 3 నుంచి జరిగే మూలాపేట మూలస్థానేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వహించాలని నెల్లూరు ఆర్డీవో మాలోలా ఆదేశించారు. శుక్రవారం ఆలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు భద్రత, ట్రాఫిక్ నియంత్రణను పోలీసు శాఖ నిర్వహించాలని తెలిపారు. నగర పాలక సంస్థ వీధిదీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి వసతి కల్పించాలన్నారు. విద్యుత్‌శాఖ 24/7 గంటల సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్నిమాపక దళ శాఖ అగ్ని ప్రమాదాలు జరగకుండా పర్యవేక్షించాలన్నారు. అనంతరం బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ధర్మకర్తలు, ఈవో వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్‌ఐ తిరుపతయ్య

వరికుంటపాడు, మార్చి 1: గొల్లపల్లి గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం ఎస్‌ఐ తిరు పతయ్య గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి 131 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రకాశం జిల్లా పామూరు నుంచి సయ్యద్ గఫూర్ అనే వ్యక్తి మోటార్ బైక్‌లో వీటిని తరలిస్తున్నాడన్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కాంచెరువులోని బెల్టు వ్యాపారులకు మద్యం తరలిస్తున్న అతన్ని అదుపులోకి తీసుకోవడంతో పాటు మద్యం సీసాలు, మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఆ వ్యక్తి గతంలో ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మేన్‌గా విధులు నిర్వర్తించినట్లు తెలిసింది.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి : కలెక్టర్



సర్వే పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్, తదితరులు

నెల్లూరు (వెంకటేశ్వర పురం) మార్చి 1 : జిల్లాలో 20 రోజుల పాటు నిర్వహించనున్న ఎంఎస్ఎంఈ పరిశ్రమల సర్వేకు ప్రజలంతా సహకరించాలని కలెక్టర్ హరినారాయణన్ కోరారు. శుక్రవారం తన కార్యాల యంలో సర్వే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మలైజేషన్‌లో భాగంగా ఎంఎస్ఎంఈ పరిశ్రమల సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే ద్వారా పారిశ్రామికవేత్తలకు పలు రాయితీలు అందించగలమన్నారు. కార్యక్రమంలో పరిశ్రమలశాఖ జీఎం సుధాకర్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

సాల్మానమ్మ ఆలయంలో చోరీ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 1: మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం వేకువ జాము వరకు పలు చోట్ల చోరీలు జరిగాయి. మండలంలోని సల్మానుపురంలోని సాల్మానమ్మ ఆలయంలో అమ్మవారి ముక్కు పుడక చోరీకి గురికాగా, దామరమడుగులో రవీంద్రరెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని 4సవర్ల బంగారు దండ, ఓ వెండిపళ్ళెం, కొంత నగదు చోరీ చేశారు. అదే ప్రాంతంలో మరో రెండిళ్ళలో చోరీకి యత్నించగా స్థానికులు అప్రమత్తం కావడంతో విఫలమై పారిపోయారు. ఈ మేరకు సీఐ హైమారావు సిబ్బంది, క్లూస్‌టీంతో పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	147
లేయర్ లైవ్	70
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	120

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5964
వెండి కిలో ధర	రూ. 71,800
వెండి ఒక గ్రాము	రూ. 73.80

విద్యుదాఘాతంలో ఒకరి మృతి

జలదంకి: జలదంకి మండలం జమ్మలపాలెం జగనన్న కాలనీలో చెరుకుపల్లి సుబ్బారావు విద్యుదాఘాతానికి గురై శుక్రవారం మృతిచెందాడు. జగనన్నకాలనీ ఇంటి నిర్మాణం చేసుకుంటున్న సుబ్బారావు నిర్మాణంలో ఉన్న ఇంటికి పైపు ద్వారా నీళ్ళు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు.

'కొరమీను' సాగు.. లాభాలు బాగు !



- ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ
- నష్టపోయిన ఆక్వా రైతులు కోలుకునే అవకాశం



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు బొక్కిస మురళీకృష్ణ. తనకున్న ఎకరాస్థలంలో తొట్టెలు నిర్మించి కొరమీను చేపలను పెంచుతున్నాడు. వాటికి పెద్ద నల్లఈగ లార్వాను ఆహారంగా అందిస్తూ ప్రయోగాత్మకంగా చేపల పెంపకాన్ని చేస్తున్నాడు. ఇతను అనుభవాలతో నల్ల ఈగ లార్వాను కూడా ఇతర రైతులు తయారు చేసుకునే విధంగా గుడ్డును కూడా సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు.



కొరమీను చేపలకు లార్వా మేత వేస్తున్న నిర్వాహకులు

అల్లూరు, మార్చి 1 : నష్టపోయిన ఆక్వా రైతులకు ఊరటనిచ్చే విషయం కొరమీను చేపల పెంపకం. సాధారణ మేత ద్వారా చేపట్టే పెంపకంతో అంతగా లాభాలు లేకున్నా, ఈగ లార్వాను మేతగా వినియోగించి అధిక లాభాలు పొందే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు ఎవరూ చేయని ప్రయత్నాన్ని ఓ రైతు చేస్తున్నాడు. బ్లాక్ సోల్జర్ ఫ్లై (పెద్ద నల్ల ఈగ) లార్వాను కొరమీను చేపలకు ఆహారంగా ఇస్తూ పెం పకాన్ని చేపడుతున్నాడు.త ద్వారా తక్కువ ఖర్చుతో ఆహారాన్ని అందించే అవకాశం ఉందని ఆ యన పేర్కొన్నాడు.

లార్వాతో ఖర్చు స్వల్పం

సాధారణ మేతతో పోల్చితే లార్వా ద్వారా మేత ఖర్చు చాలా స్వల్పంగానే ఉంటుంది. లార్వా పెంపకం ఖర్చు మినహా ఇక ఏ వ్యయం అవసరం లేదు. బ్లాక్ సోల్జర్ ఫ్లై (నల్ల పెద్ద ఈగ) లార్వాను పెంపకం చేపట్టి

లార్వా పెంపకం ఇలా...

బ్లాక్ సోల్జర్ ఫ్లై ఈగ గుడ్డును పొదిగి ఆహార వ్యర్థాలలో కలిపి ఉంచితే అవి లార్వాగా మారి అత్యధిక ప్రొటీన్ కలిగి ఉంటుంది. ఇది కొరమీను చేప పిల్లలు అత్యధికంగా తీసుకునే ఆహారంగా ఉపయోగపడుతోంది. ఈ లార్వాను రోజులో నాలుగు దఫాలుగా ఆహారంగా ఇస్తే చేపపిల్లల ఎదుగుదల త్వరగా ఉంటుంది. దీన్ని ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉండడంతో మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.

కేజీ చేప పెంపకానికి రూ.200 ఖర్చు

కొరమీను చేపను కేజీ బరువుకు పెంచాలంటే మేత ఖర్చు సుమారుగా రూ. 200 అవుతుంది. చేపపిల్ల రూ.15 కు అందుబాటులో ఉండగా, దాన్ని కేజీ బరువుకు తీసుకుని రావాలంటే మేత ఖర్చు రూ.200 కాగా, ఇక నిర్వహణా ఖర్చు మరో రూ.50 అయ్యే అవకాశం ఉంది. మొత్తంగా కేజీ కొరమీను చేప పెంపకానికి రూ.250 ఖర్చు అవుతుంది. మార్కెట్లో కేజీ కొరమీను చేప ధర రూ.300 నుంచి రూ. 350 వరకు ఉంటుంది. దీంతో అధిక ఖర్చుగానే భావించాల్సి ఉంది.



షెడ్డులో తయారవుతున్న లార్వా

కొరమీను చేపలకు ఆహారంగా వేసే అవకాశం ఉండడంతో తక్కువ ఖర్చుకు అధిక లాభాలు వస్తాయి.

తొట్టెల్లో చేపల పెంపకం

సాధారణంగా చేపల పెంపకం అంటేనే గుంటలు, చెరువులే గుర్తుకు వస్తాయి. కానీ సిమెంటు తొట్టెల్లో కొరమీను చేపల పెంపకం సులభంగా ఉంటుంది. తొట్టెలను నిర్మించుకొని వాటిలో చేపలను వదులుకొని వాటికి బలవర్ధక ఆహారాన్ని అందిస్తే అవి పెరిగే అవకాశం ఉంది. గుంటల్లో కనిపించకుండా పెరిగే ఈ చేపలు తొట్టెల్లో నిత్యం మన కంటికి కనిపిస్తూ పెరిగే అవకాశం ఉంది. కానీ గుంటల్లో పెరిగే చేపలు కేజీ పెరగటానికి 6 నెలలు సమయం పడితే తొట్టెల్లో పెరిగేందుకు 8 నుంచి 9 నెలలు పట్టే అవకాశం ఉంది.

వైసీపీకి ఓటు అడిగే హక్కు లేదు

- మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, మార్చి 1: ఐదేళ్ల వైసీపీ పాలనలో పాలకులు చేసింది ఏమీ లేదని, వారికి ఓటు అడిగే హక్కు లేదని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి ఏమి చేశారో చెప్పాలని వైసీపీ నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేశాం కాబట్టి మాకు ఓటు అడిగే హక్కుందన్నారు. జగన్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 22 పథకాలను రద్దు చేసి వారికి అన్యాయం చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే ప్రజలకు రక్షణ ఉంటుందని, చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమ పాలన అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకుపోయారన్నారు. ఈ ప్రభుత్వంలో పండుగ వస్తే కనీసం ప్రజలకు కానుక ఇచ్చే గతి లేదన్నారు. జగన్ మందు తాగితే 50ఏళ్ల లోపే చనిపోతున్నారని ఎద్దేవా చేశారు. రాక్షస పాలనను అంతం చేసేందుకు ప్రతిఒక్కరూ కంకణం కట్టుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఇసుక, మైనింగ్, లిక్కర్ మాఫియా తయారైందన్నారు. మళ్లీ జగన్ వస్తే మీ ఆస్తులు కూడా పోతా యని హెచ్చరించారు. ప్రజలందరూ ఆలోచించి టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, డాక్టర్ చంద్రహాస్, కిషోర్‌రెడ్డి, జగదల్‌నాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులు

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 1: గుంటూరు లాం ఫారం సార్వత్రిక దూర విద్యాకేంద్రం వారు వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించినట్లు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టగొడుగుల పెంపకం, సేంద్రియ వ్యవసాయంపై 8వారాలు(2నెలలు) వ్యవధిలో ఈ కోర్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు, మహిళలు, యువకులు రూ.1,500 ఫీజు చెల్లించి, ఈనెల 20లోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు కంప్యూటర్ లేదా ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ లేదా ఐపాడ్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్, లేదా 80087 88776, 83096 26619, 80960 85560 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

రోడ్డును ఆక్రమించారని ఫిర్యాదు

నెల్లూరు(హరనాథపురం), మార్చి 1: కలువాయి మండలం పెన్నబద్దేవోలు న్యూకాలనీ అరుంధతీవాడలో ఏర్పాటు చేసిన నడక రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించాడని ఆ కాలనీకి చెందిన కలువాయి బుజ్జమ్మ శుక్రవారం కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ అతడిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ నడకదారి గుండా తన ఇంటి నుంచి బయటకు వెళ్లాలన్నారు. విద్యార్థులు కూడా ఆదారి గుండా పాఠశాలకు వెళుతుంటారన్నారు. నిజమాల పెంచలయ్య, ఆయన భార్య, కుమారుడితో కలిసి ఆ దారిని మూసివేశారని పేర్కొన్నారు. ఆ రోడ్డులో ఆక్రమణ తొలగించాలని ఆమె కోరారు.



పెంచలకోన క్షేత్రంలో వైభవంగా బంగారు గరుడ వాహనంపై ఊరేగుతున్న నృసింహ స్వామి

కోనలో వైభవంగా బంగారు గరుడ వాహనసేవ

రాపూరు(డక్కిలి), మార్చి 1: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన నృసింహ స్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురష్కరించుకొని ఆలయంలో తెల్లవారు జామున 4 గంటలకు మూలమూర్తికి అభిషేకం, చందనాలంకారం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృసింహ స్వామి హోమం, స్వామి కళ్యాణం అత్యంత వైభవోపేతంగా జరిగింది. సాయంత్రం స్వామివారిని బంగారు గరుడసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఉపకమిషనర్ సాగర్ బాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

చంకనెత్తుకున్న ఆప్యాయత !

- దివ్యాంగుడిని ఎత్తుకొని మురిసిపోయిన వీపీఆర్



నెల్లూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సత్కరించాలని వచ్చి సాధ్యపడక నిలబడిపోయిన ఓ దివ్యాంగుడిని అప్యాయంగా చంకనెత్తుకుని మురిసిపోయారు వీపీఆర్. శుక్రవారం రాత్రి ఒక దివ్యాంగుడు వీపీఆర్ నివాసానికి వచ్చారు. టీడీపీలో చేరుతున్న ఆయన్ను శాలువతో సత్కరించి అభినందించాలన్నది అతని కోరిక. చేతిలో శాలువాతో ఆరడగుల ఎత్తున్న వీపీఆర్ ఎదుట నిలబడ్డాడు. శాలువా కప్పలేక అసక్తుడై వీపీఆర్ వైపు బేలగా చూశాడు. దివ్యాంగుడి అభిమానానికి ముగ్ధుడైన వీపీఆర్ కిందకు వంగి శాలువా కప్పించుకున్నాడు. అంతేగాక తన రెండు చేతులతో పైకి ఎత్తుకొని మురిసిపోయాడు. ఈ సన్నివేశాన్ని చూసి అక్కడనున్న జనం ఆనందంతో చప్పట్లు కొట్టారు. చెమర్చిన కళ్లతో దివ్యాంగుడు సంతోషంగా వెనుతిరిగాడు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన



బిజ్జంపల్లిలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

ఉదయగిరి రూరల్, మార్చి 1: బిజ్జంపల్లి వాసులు శుక్రవారం విద్యార్థులు సీపీఎం ఆధ్వర్యంలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడారు. కుర్రపల్లి గ్రామం వద్ద ఉన్న వైఎస్ ఆర్ సుజల స్రవంతి పథ కం ఉన్నా నిధుల లేమితో నిర్వహణ చేయలేక వాటర్ ప్లాంట్‌ను గుత్తేదారు మూసివేశారని వాపోయారు. ఈ సమస్యతో పది రోజులుగా గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న శుద్ధిజల కేంద్రం మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కృష్ణారెడ్డిపల్లి, లింగంనేనిపల్లి గ్రామాల ప్రజలు సైతం ఇదే ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), మార్చి 1: గత నెలలో బుచ్చి మండలం రెడ్డిపాలెంలో వృద్ధురాలిని దారుణంగా హత్య చేసి, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను శుక్రవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి విలేకరులకు వెల్లడించారు. రెడ్డి పాలెంకు చెందిన ఈశ్వరమ్మ (74)కి ఇద్దరు కుమా రులున్నారు. పెద్ద కుమారుడు నెల్లూరు బాలాజీ నగర్‌లో, రెండో కుమారుడు బెంగళూరులో నివాసం ఉంటున్నారు. ఈశ్వరమ్మ ఒంటరిగా ఉంటోంది. ఇటీవల ఆమె తన ఇంటికి మరమ్మతులు చేయించింది. గతనెల 21న ఈశ్వరమ్మ తన ఇంట్లోనే హత్యకు గురవ్వడం, ఇంట్లోని బంగారు ఆభరణాలు మాయం కావడంతో కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు బుచ్చి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాలతో నిందితుడు పాతనేరస్థుడని పోలీసులు గుర్తించా రు. బుచ్చి మండలం మునులపూడికి చెందిన షేక్ రసూల్‌గా నిర్ధారించుకున్న పోలీసులు అతడి కోసం గాలించారు. శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా వృద్ధురాలిని హత్యచేసినట్లు అంగీకరించాడు. దీంతో అతడి వద్ద నుంచి రూ.3లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, హత్యకు వినియోగించిన బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా హత్య కేసును ఛేదించిన నెల్లూరు రూరల్ డీఎస్పీ పీ వీరాంజనేయరెడ్డి, బుచ్చి ఇన్‌స్పెక్టర్ హైమారావు, ఏఎస్‌ఐ గిరిధర్‌రావు, హెడ్‌కానిస్టేబుళ్లు గంగాధర్, ఆదినారాయణ, కానిస్టేబుళ్లు సతీష్, అనీల్‌కుమార్, సంపత్, నవీన్, సురేష్, కామేశ్వరరావులను ఎస్పీ అభినందించారు.

ఇంట్లో కొయ్యపని చేస్తూ పథక రచన

ఈశ్వరమ్మ కొంతకాలం క్రితం ఇంటికి మరమ్మతులు చేయించింది. ఆ ఇంట్లో రసూల్ కొయ్యపని చేశాడు. ఇంట్లో ఈశ్వరమ్మ ఒంటరిగా ఉండటం, బీరువాలో ఆభణాలు ఉండటాన్ని రసూల్ గమనించాడు. వాటిని కాజేయాలని పథకం రచించాడు. ఈ క్రమంలో గత నెల 21న రాత్రి 8 గంటల సమయంలో నిందితుడు వృద్ధురాలిని బండ రాయి మోది హత్య చేశాడు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశపరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999 నంబర్లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు గడువు, ప్రవేశపరీక్షల తేదీలు ఇలా..

క్రమసంఖ్య	ప్రవేశపరీక్ష	దరఖాస్తు గడువు	పరీక్ష నిర్వహించే తేదీ
1	ఏపీఆర్‌జేసీ	31-03-2024	25-04-2024
2	ఏపీపాలిసెట్	05-04-2024	27-04-2024

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



ఆత్మకూరులో పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న ఎస్ఐ ముత్యాలరావు



ఉదయగిరి : విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



సంగం పరీక్ష హాలుకు వెళ్తున్న విద్యార్థులు

ఆత్మకూరు,మార్చి 1: నియోజకవర్గంలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో 1,041 మంది విద్యార్థుల్లో 974 మంది హాజరై 67మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. కేంద్రాలను సీఐ వేణు పరిశీలించారు.

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 246 మందిలో 231 మంది హాజరయ్యారు.

సీతారామపురం: ఏపీ మోడల్‌స్కూల్‌లో కేంద్రంలో 143మందిలో 139మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వహణ అధికారి మహేష్ తెలిపారు.

సంగం: నాలుగు పరీక్ష కేంద్రాల్లో 222 మంది విద్యార్థులను కేటాయించగా మొదటిరోజు 217 మంది హాజరై, 5 గురు విద్యార్థులు గైర్హజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ ఎస్ సుమతి తెలిపారు.

ఉదయగిరి రూరల్: ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలను చీఫ్ ఏ.రమణ, కమలహాసన్ పర్యవేక్షించారు. 346 మందిలో 335 మంది హాజరైనట్లు తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్ అధికారి షఫీఅహ్మద్ పర్యవేక్షించారు. పోలీసులు విద్యార్థులను తనిఖీ చేసి పంపారు.

ఇంటర్ పరీక్షల ప్రారంభం

కలిగిరి, మార్చి 1: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. పోలీసు సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు. పరీక్షలకు తొమ్మిది మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసులు తెలిపారు.

పేదల జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి



కావలి 12వ వార్డు వైసీపీ నేత శ్యాంసన్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 1: పేదల జీవితాలలో వెలుగు నింపేందుకు కృషి చేస్తానని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అన్నారు. కావలి పట్టణం 12వ వార్డులోని అరుంధతీయ వాడలో శుక్రవారం ఏబీఎం సంస్థల అధినేత జీడీడీ దివాకర్ పాల్గొన్న కార్యక్రమంలో వైసీపీ నేత దావులూరి శ్యాంసన్‌తో పాటు ఆయన అనుచరులు, నలుగురు వలంటీర్లు టీడీపీలో చేరారు. అలాగే ముసునూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో 22వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కుందుర్తి కిరణ్, మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి దావులూరు దేవకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోనేతలు గుత్తి కొండ కిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు, అక్కిలగుంట సూరి, బొమ్మా శ్రీనివాసులు పాల్గొన్నారు.



కందుకూరు: ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

ఇంటూరి సౌజన్య ప్రచారం

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య రెండవరోజు శుక్రవారం పట్టణంలోని 9వ వార్డు రెవెన్యూ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, చదలవాడ కొండయ్య, దామా కోటేశ్వరరావు, ఆలా ప్రసాద్, అత్తోట మాల్యాద్రి, గోచిపాతల కొండయ్యపాల్గొన్నారు.

20కుటుంబాలు టీడీపీలో చేరిక

బిట్రగుంట : బోగోలు మేజర్ పంచాయతీ కుమ్మరవీధికి చెందిన రజక సంఘం అధ్యక్షుడు గుండపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక 20 రజక కుటుంబాలు టీడీపీ ఇన్‌చార్జి కావ్యకృష్ణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరినట్లు మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు శుక్రవారం తెలిపారు. కార్య క్రమంలో ఆయనతో పాటు మండల ప్రధాన కార్యదర్శి సుధీర్ బాబు, రఘురామ్‌నాయుడు, మాధవరావు, పిచ్చ య్య తదితరులు ఉన్నారు.

డిజిటల్ క్లాస్‌రూం ప్రారంభం

మర్రిపాడు, మార్చి 1: బ్రాంహ్మణపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూంను శుక్రవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన తండ్రి మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం చాబోలు తిమ్మయ్యకు వైద్య ఖర్చులకు రూ.లక్ష సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

వైద్య శిబిరం..

సీతారామపురం: సీతారామపురం బిట్-2 సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ భాగ్యకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, డాక్టర్ స్వప్న, ఆరోగ్య సిబ్బంది. పంచాయతీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ఆత్మకూరు, మార్చి1: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, కమిషనర్ షేక్ ఫజులుల్లా, చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, సీహెచ్ ఆదిశేషయ్య, వల్లభనేని రాజేంద్ర, అల్లారెడ్డి ఆనందరెడ్డి పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు మెమోలు

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్ల సచివాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు శుక్రవారం ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి మెమోలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరు మంది ఉద్యోగులను మండల కార్యాలయానికి పిలిపించి మెమోలు అందజేశారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో సంజాయిషీ ఇవ్వాలన్నారు.

కలువాయిలో భారీగా టీడీపీలోకి..



కలువాయిలో టీడీపీలో చేరిన వారితో కురుగొండ్ల

కలువాయి, మార్చి 1: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన 100మంది శుక్రవారం వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ కార్యదర్శి గడ్డం కిషోర్‌రెడ్డి, ప్రేమ్ కుమార్ సమక్షంలో టీడీపీ కండువాలు వేసుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంక టేశ్వర్లు నాయుడు, కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలను కొనసాగిస్తాం

వింజమూరు, మార్చి 1: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ లక్ష సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు శుక్రవారం అరుంధతివాడలో ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జ్ గోచిపాతల ఆనంద్ మాదిగ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గంగపట్ల నాగరాజు, గంగపట్ల వెంగళరావు మాదిగ, మంగళ కిశోర్‌మాదిగ, గంగపట్ల ప్రకాశ్‌మాదిగ, మొద్దు మోహన్‌మాదిగ, గంగపట్ల పోలయ్య, కావలి నవీన్, మొద్దు శ్రీకాంత్‌మాదిగ, బాలాజీ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు సర్వం సిద్ధం

ఉదయగిరి రూరల్, మార్చి 1: ఈనెల 3న ప్రారంభమయ్యే పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్వంసిద్ధం చేసినట్లు గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శివకల్పన తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 0-5 ఏళ్లలోపు చిన్నారులు 3,605 మంది ఉన్నారన్నారు. ఆదివారం అనంతరం 4, 5వ తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ కలసపాటి వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి 'ఉండేలా' రాజీనామా

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 1: కొన్ని అనివార్య కారణాలతో వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ సొసైటీ చైర్మన్ ఉండేలా గురవారెడ్డి తెలిపారు. శుక్రవారం నందిపాడులోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తనతోపాటు మాజీ సొసైటీ అధ్యక్షుడు అన్నపురెడ్డి చినవెంగళరెడ్డి, బండకిందపల్లి సర్పంచ్ రమేష్, నందిపాడు ఎంపీటీసీ ఎస్తేరమ్మ, సీనియర్ నాయకులు చుండి రమణారెడ్డిలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

వరికుంటపాడు: మండలంలోని వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మాజీ మండల కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ భోగినేని శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు గంగవరపు పుల్లయ్య, గుంటుపల్లి నాగభూషణం, మాజీ సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, విరువూరు, తూర్పుకొండారెడ్డిపల్లి సర్పంచులు పాలకొల్లు ఉమామహేశ్వరి, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి, విరువూరు ఎంపీటీసీ భర్త కాశె రమేష్, మాజీ జేసీఎస్ కన్వీనర్ దుగ్గినేని వెంకటేష్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు తెలిపారు. శనివారం నెల్లూరులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో వేమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్నట్లు స్పష్టం చేశారు.

వైసీపీ ప్రభుత్వం దోపిడీమయం

అనంతసాగరం, మార్చి 1: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని మరచి దోపిడి, అవినీతికి తెరలేపినట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన అనంతసాగరం బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమైయ్యారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి ఎక్కువైందని.. గ్రావెల్, ఇసుక, దోపిడి చేస్తూ ప్రజాసంక్షేమం గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకూరు నాగరాజారెడ్డి, కుడుమల సుదాకర్‌రెడ్డి, అల్లంపాటి రమణారెడ్డి, రాజేష్‌రెడ్డి, గురువారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

ఉదయగిరి: స్థానిక మండల కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వలంటీర్లకు సేవరత్న, సేవవజ్ర ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ్రాజ్యం, ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఓబులరెడ్డి, తాజుద్దీన్, షేక్ పెదమస్తాన్, మూలె వీరారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో విజయ సంకల్పయాత్ర

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం వెంకటంపేట, పాపంపల్లి, నందిపాడు, రెడ్లదిన్నె పంచాయతీల్లో విజయ సంకల్పయాత్ర చేపట్టారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, ఎల్‌పీ మాలకొండారెడ్డి, మండ్ల శ్రీనివాసులు, తుమ్మల వెంగయ్యచౌదరి, సర్పంచ్‌లు సుజాత, ఆదెమ్మ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన మేకపాటి దంపతులు



మర్రిపాడు, మార్చి 1: టీడీపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, సతీమణి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శాంతి కుమారి శుక్రవారం హైదరాబాద్‌లోని చంద్రబా బు నివాసంలో కలిశారు. ఉదయగిరి నియోజ కవర్గంలో జరుగుతున్న తాజా రాజకీయాలపై చర్చించినట్లు మేకపాటి తెలిపారు.

- చంద్రబాబు సభను జయప్రదం చేయండి

ఉదయగిరి: నెల్లూరు నగరంలోని వీపీఆర్ కన్వెన్షన్‌హాల్‌లో శనివారం జరిగే నారా చంద్రబాబునాయుడు సభను జయప్రదం చేయాలని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కాకర్ల సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

న్యాక్ కేంద్రాన్ని తరలించవద్దని వినతి

ఉదయగిరి, మార్చి 1: బీసీ బాలుర వసతిగృహంలో నిర్వహిస్తున్న న్యాక్ శిక్షణ కేంద్రాన్ని తరలించవద్దని నిర్వాహకులు లక్కినేని ప్రకాష్‌రావు శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిరుపేదలైన చేతివృత్తిదారులకు శిక్షణ ఇచ్చే కేంద్రాన్ని మరో ప్రాంతానికి తరలించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఉదయగిరి రూరల్, మార్చి 1: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సయ్యద్ తహీర్‌అలీ హుస్సేనీ (కలీం)కు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందాడు ఈ సందర్భంగా పాఠశాలలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీరువా వితరణ

ఉదయగిరి రూరల్: స్థానిక ఎంఈవో కార్యాలయానికి పట్టణంలోని స్టేట్‌పేట ఏబీఎం ఎయిడెడ్ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుడు లక్కినేని అశోక్‌కుమార్ శుక్రవా రం ఎంఈవో షేక్ మస్తాన్‌వలికి బీరువాను అందజేశారు. రికార్డులను భద్రపరిచేందుకు తన తండ్రి లక్కినేని సత్యప్రకాష్ జ్ఞాపకార్థం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకు భూపంపిణీ చేయాలి

జలదంకి, మార్చి 1: తిమ్మసముద్రం గ్రామంలో అనర్హులకు భూపంపిణీ చేసేందుకు రెవెన్యూశాఖ సిద్ధమయ్యారని ఆరోపిస్తూ మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు గ్రామస్థులతో కలసి శుక్రవారం డిటి భరత్‌కు తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల రెవెన్యూ అధికారులు విచారించి అర్హులకు భూపంపిణీ చేయాలని, లేనిపక్షంలో జిల్లాకలెక్టర్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వినోద్ వెంట దివి లోకేష్, కాసు మహేశ్వరరావు, మబ్బు ప్రసాద్‌లు ఉన్నారు.

హెల్త్ సెంటర్ ప్రారంభం

లింగసముద్రం, మార్చి 1: కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శుక్రవారం మండలంలోని మాలకొండరాయునిపాలెంలో హెల్త్ సెంటర్ భవనాన్ని, లింగసముద్రంలో డిజిటల్ లైబ్రరీని, పెంట్రాలలో రైతు భరోసా, డిజిటల్ లైబ్రరీ, హెల్త్ సెంటర్, పాలకేంద్రం నూతన భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓ యు శేషుబాబు, ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, ఏఈ హనుమంతరావు, వైద్యాధికారి డా.రమేష్, సర్పంచ్ పులి రాఘవులు మండల వైసీపీ కన్వీనర్ పి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం

ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ఇందూల్యాండ్ అనే మల్టీ నేషనల్ కంపెనీ వారు విద్యార్థుల కోసం సుమారు రూ.19 లక్షలతో నిర్మించిన గాల్వనైజ్ షెడ్‌ను ప్రారంభించారు.

రహదారి విస్తరణ ప్రారంభం

కలిగిరి, మార్చి 1: కావలి, దుత్తలూరు, సీతారాంపురం రహదారి విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కావలి మార్గం కలిగిరిలో రహదారి విస్తరణ పనుల ప్రారంభించారు.

ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళి

కావలిటౌన్, మార్చి1: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అశువులు బాసిన ఎమ్మార్పీఎస్ అమరవీరులకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నేతలు నివాళులు అర్పించారు. అమర వీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డులోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మెస్పీ గౌరవాధ్యక్షుడు జీ వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు గేరా జానకి, నేతలు చేవూరు కిరణ్, జీ కొండయ్య, కొణిజేటి రామ్మోహన్, అక్కిలిగుంట యేసు, మహేష్ కత్తి శివయ్య పాల్గొన్నారు.

31 లోపు ఇంటి పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

కావలి, మార్చి1: పట్టణంలోని ఇళ్ల, ఆస్తుల యజమానులు ఈనెల 31 లోపు పన్నులు చెల్లిస్తే వడ్డీ మినహాయింపు ఉంటుందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే విష్ణుతో వేమిరెడ్డి చర్చలు



విష్ణుతో చర్చల అనంతరం బయటికి వస్తున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

అల్లూరు, మార్చి 1: మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్థన్‌రెడ్డితో మాజీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఏకాంతంగా చర్చించారు. అల్లూరులోని విష్ణు నివాసానికి ఆయన వచ్చి ఆయనతో దాదాపు గంటకుపైగా మాట్లాడారు. వేమిరెడ్డితో భేటీ అనంతరం విష్ణు విలేకరులతో మాట్లాడుతూ వేమిరెడ్డి పోటీచేస్తున్న నేపథ్యంలో తనకు మద్దతు తెలపాలని కోరినట్టు ఆయన వివరించారు. ఇందుకు ఆయన సమాధానంగా తాను కూడా పోటీలో ఉంటున్నందున ఒకే పార్టీలో ఉంటే మద్దతు తప్పకుండా ఉంటుందని, కానీ తాను ఇతర పార్టీ గుర్తుపై పోటీ చేస్తున్నందున మద్దతు తెలిపే అవకాశం లేదని తన అభిప్రాయాన్ని తెలిపానన్నారు.

శంఖారావం సభలను జయప్రదం చేయండి

కందుకూరు, మార్చి 1: తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ నిర్వహిస్తున్న శంఖారావం సభలను జయప్రదం చేయాలని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో కోరారు. 3వ తేదీ నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రారంభమవుతున్న శంఖారావం సభలలో యువత పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్టాంపు వెండర్లు లేఖరులుగా వ్యవహరిస్తే చర్యలు



స్టాంపు వెండర్లను విచారిస్తున్న జిల్లా రిజిస్ట్రారు

అల్లూరు, మార్చి 1: స్టాంపు వెండర్లు దస్తావేజు లేఖరులుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని, అదేవిధంగా స్టాంపు వెండర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోనే నాన్ జుడీషియల్ స్టాంపులను విక్రయించాలని, ఎక్కడపడితే అక్కడ విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తానని హెచ్చరించారు. స్టాంపు వెండర్లు దస్తావేజు లేఖరులుగా వ్యవహరిస్తున్నారని ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆయన అల్లూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సులు పొందిన వెండర్లకు దస్తావేజులు రాసే అధికారం లేదని, స్టాంపులు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు.

నాణ్యమైన వస్తువులు వినియోగించాలి

కావలి రూరల్, మార్చి1: ప్రతిఒక్కరూ నాణ్యమైన వస్తువులను మాత్రమే వినియోగించాలని ఏపీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అబ్జర్వర్ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. కావలి పట్టణ ఎమ్పీడీవో కార్యాలయంలో ఎమ్పీడీవో ఎవి క్రిష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నాణ్యమైన వస్తువుల కొనుగోలు, వినియోగంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. .

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ఉలవపాడు, మార్చి 1: జగనన్న కాలనీల పేరుతో పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ పట్టాలు శుక్రవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండంలోని 1624 మందికి ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలను ఎంపీడీవో విజయ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ డీటీ వీరయ్యలు అందచేశారు.

పాపాయకుంట ఆక్రమణపై సర్వే

ఉలవపాడు: పాపాయకుంట ఆక్రమణకు గురైందని స్థానికుడు మహంకాళి వెంకటేశ్వర్లు లోకాయుక్తలో కేసు నమోదు చేశాడు. దీనిలో భాగంగా పోలేరమ్మ గుడి కుంట పోరం బోకు స్థలంలో నిర్మించారని పేర్కొనడంతో శుక్రవారం లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ గంగరాజు ఫిర్యాదుదారుడి సమక్షంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావుతో సర్వే చేయించారు. పోలేరమ్మ గుడి నిర్మాణం గ్రామ కంఠంలో ఉందని పాపాయకుంటకు సంబంధం లేదని సర్వేయర్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లింగసముద్రం, మార్చి 1: మండలంలోని పెదపవని గ్రామంలో పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుడ్లూరు సీఐ జీ సుబ్బారావు, లింగసముద్రం ఎస్సై ఎం బాజీబాబు సిబ్బంది దాడి చేసి పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకొని, వారి నుండి రూ.18,500, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బాజీబాబు చెప్పారు.

చోరీ కేసులో హిజ్రాల అరెస్టు

కావలి రూరల్: పాతూరుకు చెందిన టైలర్ పొదలకూరు శ్రీనివాసులు మెడలోని బంగారు గొలుసు గురువారం సాయంత్రం దొంగిలించిన ఇద్దరు హిజ్రాలను శుక్రవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి బంగారు గొలుసు స్వాధీనం చేసుకు న్నట్లు 1వ పట్టణ సిఐ రాజేష్ తెలిపారు. బట్టలు కుట్టించుకునేందుకని టైలర్ వద్దకు వెళ్లిన హిజ్రాలు ఒకరు గేటు వద్ద ఉండగా మరొకరు షాపులోకి వెళ్లి బాధితుడి మెడలోని బంగారు చైను దొంగిలించుకు పోయినట్లు ఫిర్యాదు చేశాడు. దీంతో సిఐ సిబ్బందితో కలసి పట్టణంలోని హిజ్రాలను విచారించి ఉదయగిరికి చెందిన కోనేటి అశోక్ అలియాస్ అక్షిత, ఇందుకూరు పేటలోని మైపాడు అక్కయ్యగారి బాలు అలియాస్ భాను అను హిజ్రాలను గుర్తించి అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోవాలి

కొండాపురం, మార్చి 1: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు పాఠశాలల్లో ఒకటవ తరగతిలో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు కే రవికుమార్, ఆనందరావు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు సచివాలయం, నెట్‌సెంటర్లలో మార్చి 14 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి 1: 2024- 25 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 3వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

లింగసముద్రం, మార్చి 1: తిమ్మారెడ్డి పాలెంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు వలేటివారి పాలెం గ్రామానికి చెందిన కొల్లు కిషోర్‌బాబు అనే యువ కుడు పరీక్షల సామాగ్రి అందజేశారు. శుక్రవారం మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్సార్‌తో కలిసి ఆయన ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న 50 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

6న సీజ్ చేసిన వాహనాల వేలం

కందుకూరు, మార్చి 1: రవాణా శాఖ తనిఖీలలో సీజ్ చేసిన మోటారు సైకిళ్లు, ఇతర వాహనాలకు ఈనెల 6న స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఎంవీఐ షేక్ మహ్మద్ రఫీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హోరాహోరీగా రైల్వే డివిజనల్ క్రికెట్ పోటీలు

బిట్రగుంట, మార్చి 1: బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడ డివిజనల్‌స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. స్థానిక బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి జీవన్‌కుమార్ పర్యవేక్షణలో రెండు క్రీడామైదానాలలో మూడు జట్లు పోటీపడ్డాయి. నెల్లూరు ఎస్ఎన్‌టీ డిపార్ట్‌మెంట్‌పై పడుగుపాడు ఇంజినీరింగ్ విభాగం గెలుపొందింది. బిట్రగుంట ఎస్ఎస్ మీనా జట్టుపై గూడూరు ఆర్పీఎఫ్ టీమ్ విజయం సాధించింది. బిట్రగుంట హోమ్ టీమ్‌పై నెల్లూరు టీఆర్డీ జట్టు గెలుపొందగా, కావలి ఇంజనీరింగ్ జట్టు, బిట్రగుంట టీఎంఆర్ జట్టు రాకపోవడంతో పోటీని వాయిదా వేశారు.

అంతర్జాతీయ వీల్‌చేర్ దినోత్సవం

వెంకటాచలం, మార్చి 1: చవటపాళెం పంచాయతీలోని సరస్వతినగర్ సమీపంలో ఉన్న ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్‌సీ)లో శుక్రవారం అంతర్జాతీయ వీల్‌చేర్ దినోత్సవాన్ని నిర్వహించారు. సీఆర్‌సీ సంస్థ డైరెక్టర్ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు టి.అంకబాబు, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు పాల్గొన్నారు. వీల్‌చెర్స్‌ను వైకలాంగుల చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో రామానుజులు, రాయాపురెడ్డి, సీఆర్‌సీ ప్రతినిధులు తదితరులున్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

మనుబోలు, మార్చి 1: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక వైద్యాధికారిని మోహసీనా సుల్తానా అంగన్‌వాడీ వర్కర్స్‌కు, ఆశ వాలంటీర్లకు ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయంపై స్థానిక వైద్యశాలలో పల్స్ పోలియోపై వారికి శిక్షణ ఇచ్చారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. మండలంలో 0- 5 సంవత్సరాల చిన్నారులు 4,568 మంది ఉన్నారని, అందరికి పోలియో చుక్కలు వేయాలన్నారు. మండలంలో గ్రామాలవారీగా 40 బూతులు, స్థానిక బస్టాండ్ సెంటర్ నందు ఒక బూత్, మొబైల్ బూత్ ఒకటి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 45 మంది వ్యాక్సినేటర్లు పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజయ్య, హెల్త్ సూపర్వైజర్లు రమణయ్య, హైమావతి తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల్ని పరిశీలిస్తున్న తహసీల్దారు విజయశ్రీ

కోవూరు, మార్చి 1: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్ని తహసీల్దారు విజయశ్రీ శుక్రవారం పరిశీలించారు. వేగూరు గ్రామంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు కనీస వసతి సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఆమె వెంట ఆర్ఐ రమణయ్య, వీఆర్వో మల్లికార్జున తదితరులున్నారు.

ఓటు నమోదు నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

కోవూరు, మార్చి 1: ఓటు నమోదు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం శ్రీనివాసులు అన్నారు. స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పొందడం యువకులు హక్కుగా భావించాలన్నారు. గ్రామాల్లో రాజకీయపార్టీల నాయకులు, అధికారులు ప్రచారం చేయాలన్నారు. ఓటర్ల వివరాల మార్పులు, చేర్పులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు మధు, రవికుమార్ మాట్లాడారు.

చెల్లటూరులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ

రాపూరు(డక్కిలి), మార్చి 1: మండలంలోని చెల్లటూరు డ్యాం ఎస్టీకాలనీలో శుక్రవారం బాబూ ష్యూరిటీ.. భవిషత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఐటీడీపీ కోఆర్డినేటర్ బక్క శంకరయ్య ఆధ్వర్యంలో నాయకులు పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించారు. రాన్నుకల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దశయ్య, బుజ్జి, నరసింహం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కర్మక్రతువుల భవనం నేడు ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం) : బ్రాహ్మణ కర్మక్రతువుల భవనాన్ని శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నట్లు 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, కాశీవిశ్వేశ్వర బ్రాహ్మణ కర్మక్రతువుల భవనం కార్యవర్గ సభ్యులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

బిల్లులు ఇచ్చాం.. నిర్మాణాలేవి?



ఇళ్ల స్థలాల ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

తోటపల్లి గూడూ రు, మార్చి 1: గృహ నిర్మాణాలు చేపడుతామంటే.. డ్రా చేసి బిల్లులు ఇచ్చామని ఇంతవరకు ఆ ఊసే లేదని వరిగొండ పంచాయతీలోని జగనన్న కాలనీలో గిరిజనులు నెట్రంబాకశాంతి, బూదూరు శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు వారికి కేటాయించిన స్థలాల ఎదుట మాట్లాడారు. వరిగొండ పంచాయతీలోని మహాలక్ష్మీపురం గిరిజన కాలనీకి చెందిన 25 కుటుంబాలకు ఇల్లు నిర్మించకుండానే వైసీపీ కీలక నేత బిల్లులు డ్రా చేసుకుని స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయమై అడిగితే తన అనుచరుల చేత బెదిరిస్తున్నారని తెలిపారు. ఒక్క లబ్ధిదారు నుంచి రూ.40వేలు నుంచి 50వేలు వరకు, 35 కట్టల సిమెంటు, 340 కేజీల కమ్మిని తీసుకున్నారని చెప్పారు. త్వరితగతిన తమ గృహాలు నిర్మించాలని గిరిజనులు కోరారు. ఈ కార్యక్రమంలో పత్రా చెంచమ్మ, బండి లలితమ్మ, చింతా వరలక్ష్మీ, తదితరులున్నారు.

కాకాణికి బ్యాడ్ టైం స్టార్ట్ అయ్యింది!

- **మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ నేత సోమిరెడ్డి

పొదలకూరు, మార్చి 1: మూడురోజుల క్రితం మంత్రి కాకాణి తన ఫేస్‌బుక్ ఖాతాలో తాను మహిళల మెడలో మంగళసూత్రాలు దొంగిలించుకుపోతున్నట్లుగా సిగ్గులేకుండా, నీచమైన పోస్టు పెట్టాడని నిజంగా సర్వేపల్లిలో మహిళల మంగళసూత్రాలను తెంచుతున్నది ఆయనేనని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మర్రిపల్లిలో బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు పొదలకూరు పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లకు బాబు సూపర్ సిక్స్ కిట్లను అందజేసి మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ కేసులు, 307 కేసులు పెట్టించి పోలీసులు చేత కొట్టించి, చంపించి సర్వేపల్లి నియోజకవర్గంలో పలువురి మహిళల మంగళసూత్రాలను తెంచిన వ్యక్తి మంత్రి కాకాణి అని అన్నారు. దళితుల భూములను, ఉపాధ్యాయుల ప్లాట్లను దోచుకున్న వ్యక్తి కాకాణి అన్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపల్లి టీడీపీ నాయకులు వెంపులూరి రామకృష్ణగౌడ్, పెంచలయ్య, శంకరయ్య, సీనయ్య, మాలపాటి బుద్ధిరెడ్డి, బాలకృష్ణ, బిల్లు సుందరయ్య, తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, అత్యం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పింఛన్ల పంపిణీ

- ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తాం
- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు



ఎంపీడీవోకి వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

మనుబోలు, మార్చి 1: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పింఛన్ల పంపిణీపై టీడీపీ నాయకులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ తిరుపతి పార్లమెం టు ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి మాట్లాడారు. వైసీపీ నాయకులు నిబంధనలకు వ్యతిరేకంగా పింఛన్లు పంపిణీ చేస్తు న్నారని విమర్శించారు. వైసీపీ నాయకులు తమ చేతుల్లో నగదు ఇస్తు న్నట్లుగా ఫొజులు కొడుతూ ఓట్ల కోసం మభ్యపెడుతున్నారని విమర్శించారు. వాలంటీర్లు పంచాల్సిన పింఛన్ సొమ్ము వైసీపీ నాయకులు ఎలా ఇస్తారని ఎంపీడీవోని ప్రశ్నించారు. అధికారులు విచా రణ చేసి చర్యలు చేపట్టకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పంపిణీ జరుగుతున్న తీరును వైసీపీ నాయకులు సోషల్‌మీడియాలో చేస్తున్న పోస్టులపై అధికారులు ఎందుకు పట్టించుకో వడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో రాయపాటి కిరణ్‌కుమార్, కలికి రమేష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, మారంరెడ్డి రమణారెడ్డి, చింతల వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కామాక్షితాయి సేవలో ఎమ్మెల్యే కుటుంబం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడ ఆలయంలో కోవూరు ఎమ్మెల్యే సతీమణి నల్లపురెడ్డి గీతమ్మ, కోడలు పూజితరెడ్డి, మనుమరాలు విజితరెడ్డి శుక్రవారం శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వి గిరికృష్ణ అర్చకులు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే ప్రకాశం జిల్లా దేవాదాయశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి కుటుంబం జొన్నవాడ ఆలయంలో శుక్రవారం శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి వారిని దర్శించుకున్నారు. వారి కుమార్తె, అల్లుడు డాక్టర్ కావ్యశ్రీ, డాక్టర్ సాయి ప్రతీక్‌రెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకోగా ఆలయ ఈవో గిరికృష్ణ వారికి వేదపండితుల ఆశీర్వాదాలు అందజేశారు.

- **కామాక్షితాయి ఆలయ పాలక మండలి తొలి సమావేశం**

జొన్నవాడ ఆలయంలో శుక్రవారం ఆలయ చెర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన ఆలయ ఈఓ వి గిరికృష్ణ ఆధ్వర్యంలో పాలకమండలి సభ్యులతో తొలి పాలకమండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆలయంలో దాతల సహకారంతో చేపట్టబోయే అభివృద్ధి పనులు గురించి చర్చించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

పేదలకిచ్చే భూముల్లో
రూ.7వేల కోట్ల కుంభకోణం : అజీజ్

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 1 : పేదలకు ఇచ్చే భూముల్లో వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు రూ.7వేల కోట్లకుపైగా కుంభకోణం చేశారని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆరోపించారు. నగరంలోని 52వ డివిజన్ చిత్రకూటం వీధిలో శుక్రవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఐదు లక్షల చొప్పున పాతిక లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పారని దుయ్యబట్టారు. ఓటీఎస్ పేరుతో చంద్రబాబు ఉచితంగా ఇచ్చిన ఇళ్లకు బలవంతంగా రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం రాగానే పేదల సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్, వెంకయ్య యాదవ్, పాషా మోమిద్దీన్, పిగిలం సుధీర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు మూసేసిన చరిత్ర జగన్‌ది ! : డాక్టర్ సింధూర

నెల్లూరు (వైద్యం) : నిరుపేదలకు కడుపునిండా అన్నంపెట్టే అన్న క్యాంటీన్లు మూసేసిన చరిత్ర సీఎం జగన్మోహన్‌రెడ్డిదేనని మాజీమంత్రి పొంగూరు నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర అన్నారు. శుక్రవారం ఆమె 44వ డివిజన్‌లో బాబూష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి మేనిఫెస్టో కరపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు నగరాన్ని అభివృద్ధి చేసింది నారాయణేనన్నారు. పేదలకు మంచినీరు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ జరగాలంటే అది టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు. 2014లో టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

నారాయణను గెలిపించాలి : బాలయ్య సైన్యం : మాజీ మంత్రి పొంగూరు నారాయణను నెల్లూరు సిటీ నుంచి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి కోరారు. శుక్రవారం 9వ డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో నీతి, నిజాయితీ గెలుస్తుందన్నారు. నారాయణను గెలిపిస్తే నగరానికి మహాయోగం పడుతుందన్నారు. కార్యక్రమంలో బాలయ్యసైన్యం నేతలు బాబూరావ్, మన్యంప్రసాద్, వందాటి నరసింహులు, గోపాల్‌నాయుడు, హరినాయుడు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

- **క్రైస్తవులను మోసగించేందుకు జగన్ సిద్ధం**

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : రాష్ట్రంలోని క్రైస్తవులను మరోసారి మోసం చేసేందుకు సీఎం జగన్ సిద్ధమయ్యాడని క్రిస్టియన్ సెల్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 75 వేలమంది పాస్టర్లు ఉంటే కేవలం 10శాతం మందికి మాత్రమే గౌరవ వేతనం ఇచ్చి అందరిని మోసం చేశారన్నారు. రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా జగన్ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు, దేవప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



14వ డివిజన్‌లో పర్యటిస్తూ విక్టరీ సింబల్ చూపుతున్న డాక్టర్ సింధూర



9వ డివిజన్‌లో కరపత్రాలు పంచుతున్న బాలయ్య సైన్యం ప్రతినిధులు



టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న స్వామిదాసు తదితరులు

ఇళ్ల పట్టాల పంపిణీ బోగస్ : దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 1: మరో 15రోజుల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఇళ్ళ పట్టాల పంపిణీ బోగస్ అని టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బుచ్చిలోని 4, 5 వార్డుల్లో ఆ వార్డు నాయకులు అత్తిపాటి శివ, మాజీ ఎంపీటీసీ పుట్టా ధనలక్ష్మి, రంగనాధంలతో కలిసి ఆయన ప్రతి అడుగు ప్రజల కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మినీ మేనిఫెస్టోలో పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాఘవరెడ్డి, శ్రీనివాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

- **టీడీపీలో చేరికలు**

తూర్పు దళితవాడలో ఏర్పాటు చేసిన సభలో స్థానిక నేతలు ఎస్‌వీ ప్రసాద్, పల్లం సతీష్ ఆధ్వర్యంలో దినేష్‌రెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో ఎంవీ శేషయ్య, పురుషోత్తం, అంకయ్య, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణచైతన్య, రామానాయుడు, రంగనాధం, హరనాథ్, కొండయ్య, వుసురుపాటి, కిషోర్, పి.నరసయ్య, శంకర్, శివ పాల్గొన్నారు.

పాఠశాలకు మైకుసెట్టు బహూకరణ

కోవూరు, మార్చి 1: మండల పరిధిలోని ఇనమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు శుక్రవారం మైకుసెట్టును బహూకరించారు. 1986-87 విద్యాసంవత్సరం లో పదో తరగతి చదివిన హరిబాబు, మురళి, అనిల్‌కుమార్ ప్రధానోపాధ్యాయిని రాధారాణికి మైకుసెట్టును, ఇతర సామాగ్రిని అందించారు.

రూరల్ టీడీపీలో భారీగా చేరికలు

నెల్లూరు(వ్యవ సాయం), మార్చి 1: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో భారీగా చేరికలు జరిగాయి. 35వ డివిజన్ లక్ష్మీనరసింహపురానికి చెందిన మౌలాలి, మహేంద్ర, షాకీర్, కనక, అజయ్ వారి మిత్ర బృందం ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కోటంరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ పరిధిలో వాడవాడలా, యువత, మహిళలు, రైతులు, వివిధ వర్గాలకు చెందిన వారు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి వెంకటేశ్వర్లు, వా సిరెడ్డి చంద్రనాగ్, షేక్ షంషుద్దీన్, లక్ష్మీరెడ్డి, కుమార్‌రాజా, చీపినాపి రవి, కార్తీక్, గిరిష్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- **కోటంరెడ్డి భార్య,కుమార్తెల ప్రచారం**

33వ డివిజన్ నేతాజీనగర్‌లో శుక్రవారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి కోటంరెడ్డి సుజితమ్మ, కుమార్తెలు హైందవి, వైష్ణవిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని ఇంటింటికి తిరిగి అభ్యర్థించారు.

- **జనసేన కార్యాలయానికి కోటంరెడ్డి బ్రదర్స్**

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు శుక్రవారం నగరంలోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయానికి వెళ్లారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి,నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మనుక్రాంత్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీధర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు.

సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం : ఎస్పీ

నెల్లూరు(క్రైం) : జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా భావించి పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ డాక్టర్ కె తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఎస్పీ స్వయంగా సిబ్బంది నుంచి అర్జీలు స్వీకరించి, ముఖాముఖిగా మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, స్పందన ఇన్‌చార్జ్ ఏఎస్ఐ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రముఖ న్యాయవాది అనంత రామయ్యకు నివాళి

నెల్లూరు (వైద్యం) : ప్రముఖ న్యాయవాది, సీపీఐ నేత వేములపాటి అనంతరామయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో అనంతరామయ్య చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నేత రామరాజు, జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు జిలానిఖాన్, సీపీఐ నేతలు షాన్‌వాజ్, వాటంబేటి నాగేంద్ర, లీలామోహన్, ముక్తియార్, స్టాలిన్, లజపతిరాయ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం : సీఐటీయూ

నెల్లూరు (వైద్యం) : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఐదేళ్లుగా తీవ్ర అన్యాయం చేసిం దని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం భవన నిర్మా ణ కార్మిక సంఘం నెల్లూరు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు నగరంలోని కొండాయపాళెం గేటు నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను పక్కదారి పట్టిస్తుందని, ఇందుకు సీఎం జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, సీఐ టీ యూ రూరల్ కార్యదర్శి కిన్నెరకుమార్, కార్మిక సంఘం నేతలు ఖలీల్, వెంకట్రావ్, మాలకొం డయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వసతులు ఏర్పాటు చేయండి : డాక్టర్ సిరాజ్



వినతిపత్రం ఇస్తున్న సిరాజ్ తదితరులు

నెల్లూరు (వైద్యం)మార్చి 1 : ప్రభుత్వ జనర ల్ ఆసుపత్రిలో రోగులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని టీడీపీ వైద్య విభాగం అధికార ప్రతి నిధి డాక్టర్ షేక్ సిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మే రకు శుక్రవారం డీఆర్‌వోకు వినతిపత్రం అందించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్ర సూతి విభాగంలో అవసరమైన రక్తపరీక్షలు చేయ కపోవటంతో రోగులు బయటకు వెళ్లాల్సి వస్తుంద ని ఆవేదన వ్యక్తం చేశారు.గర్భిణులకు 6 నెలలకు ఒకసారి అవసరమైన అల్ట్రాసౌండ్ బయటకు రాస్తున్నారన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు సే వలు సరిగ్గా లేవని, వాటి సంఖ్యను పెంచాలని కోరారు. రెసి డెంట్ క్షయ రోగులకు వైద్య కళా శాల పరిధిలోనే మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ కిషోర్స్ రత్నం వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

నెల్లూరు : నగరంలోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో ఉన్న డాక్టర్ కిషోర్స్ రత్నం థింక్ నెక్స్ట్ స్కూల్‌లో శుక్రవారం 'ముగ్ధ దజాయ్ ఆఫ్ డాన్స్' పేరుతో వార్షికోత్సవాన్ని ఘ నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ర త్నం స్కూల్ డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషో ర్, వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన వివిధ నృత్యాలను వారు తిలకించారు. భరత వేదమున... కన్నా నిదురించరా.. జయ జయ శివశంకర.. చిన్ని చిన్ని ఆశ.. తదితర పాటలకు చిన్నారులు చేసిన నృత్యాలు వీక్షకులను అలరించాయి. మధ్యమధ్యలో విద్యార్థుల చక్కగా యాంకరింగ్ చేసి అబ్బురపరిచారు. చక్కటి ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను ముఖ్యఅతిథులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులను సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

వేదగిరి క్షేత్రంలో తిరుప్పావడ సేవ



తిరుప్పావడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లూరురూరల్ : వేదగిరీశుడికి శుక్రవారం ఆలయ అర్చకులు తిరుప్పావడసేవ నిర్వహించారు. లక్ష్మీనరసింహుడి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో ఆలయంలోని స్వామి సన్నిధి వద్ద ఈ వేడుకలు జరిపారు. ముందుగా మూలవర్లకు పంచామృత అభిషేకం, అనంతరం విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

నెల్లూరు(హరనాథపురం) : నగరంలోని 20వ డివిజన్ పరిధి ఇస్కాన్ టెంపుల్ ప్రాంతంలో సిమెంటు రోడ్డు పనులకు ఎంపీ అదాల ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ డివిజన్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇరుకళల పరమేశ్వరి ఆలయ చైర్మన్ రావు శ్రీనివాసరావు, కార్పొరేషన్ మేయర్ స్రవంతి, విజయడెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

నెల్లూరు(హరనాథపురం) : నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం మాదిగ అమరవీరులకు ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్, ఎంఎంఎస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పింఅర్పించారు. కార్యక్రమంలో నాయకులు పందిటి అంబేడ్కర్ మాదిగ, సూరిపాక ఉదయకృష్ణ మాదిగ, వడ్లపల్లి రమణమ్మ పాల్గొన్నారు.

అరుదైన గర్భసంచి తొలగింపు

నెల్లూరు (వైద్యం) : నగరంలోని దుర్గా ఆసుపత్రిలో శుక్రవారం ప్రముఖ గర్భకోశవ్యాధి నిపుణురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర్ అరుదైన గర్భసంచిని తొలగించారు. తిరుపతి జిల్లా చిట్టమూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు సతీమణి సుభాషిణి రెండేళ్లుగా బ్లీడింగ్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గా ఆసుపత్రికి రాగా పరీక్షలు చేసి, ఆమె గర్భసంచి రెండుగా చీలి ఉన్నట్లు గుర్తించారు. ఈ చీలిక మధ్య, అన్నవాహిని, మూత్రనాళం కలిసి ఒక గోడలాగా ఉన్నట్లు డాక్టర్ యశోధర్ గుర్తించారు. ల్యాప్రోస్కోపి ద్వారా బాధితురాలికి శస్త్రచికిత్స నిర్వహించి గర్భసంచిని తొలగించారు. దీంతో బాధితురాలు కోలుకుంది.

రోడ్లపై పశువులు కనిపిస్తే జరిమానా

నెల్లూరు(సిటీ) : రోడ్లపై పశువులు కనిపిస్తే వాటి యజమానులకు జరిమానా విధిస్తామని ఎంహెచ్‌వో వెంకటరమణయ్య, మున్సిపల్ వెటర్నరీ అధికారి మదన్‌మోహన్ హెచ్చరించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న పశువులను వాహనంలో ఎక్కించి క ల్లూరిపల్లి వద్ద ఉన్న గోశాలకు తరలించారు. కాగా కార్పొరే షన్ కార్యాలయంలో ఏడీసీ శర్మద సమీక్ష నిర్వహించి, సచివాలయాల పరిధిలోపరిశ్రమలు, వాటి స్థితిగతులను గుర్తించాలన్నారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న 22వ అష్టలక్ష్మి యాగంలో భాగంగా శుక్రవారం రాత్రి సామూహిక లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. అష్టలక్ష్మీ పీఠం వ్యవస్థాపకులు పీతాంబరం రఘునాధచార్యస్వామి ఆధ్వర్యంలో ఉదయం పెరుమాళ్ ఆరాధన, అభిషేకం జరిగాయి. అనంతరం శ్రీలక్ష్మీ ఇష్ట హోమం, పూర్ణాహుతిలు జరిగాయి. సాయంత్రం లక్ష కుంకుమార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిమెళ్ల బద్రీనాథ్‌స్వామి - శ్రీదేవి దంపతులకు మాతృదేవోభవ అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమాలను కే హరి, వీ గిరి, కే రమేష్, పరంధామయ్య, సుబ్బారావు పర్యవేక్షించారు.

జాషువా గ్రంథాలయాన్ని పునర్‌నిర్మించండి

నెల్లూరు (సాంస్కృతికం) : రెడ్‌క్రాస్‌భవనం వీధిలో ఉన్న గుర్రం జాషువా గ్రంథాలయాన్ని పునర్నిర్మించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. గ్రంథాలయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కె.ఖాసిం, వైస్ ప్రెసిడెంట్ జీవీ కృష్ణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొమ్మల కృష్ణయ్యలు శుక్రవారం సాయంత్రం కమిషనర్‌ను కలిసి పునర్‌నిర్మాణ పనుల గురించి వివరించారు. మిగిలిన పనులు పూర్తి కావాలంటే రూ.15లక్షలు అవసరం అవుతాయని వారు తెలిపారు. స్పందించిన కమిషనర్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఎస్‌ఈని ఆదేశించారు.

బీసీలకు అండగా ఉంటాం..

తోటపల్లిగూడూరు : బీసీలకు అండగా వైసీపీ ప్రభుత్వం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వీలుకానిపల్లి టీఎంఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో శుక్రవారం బీసీలు సిద్ధం కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొన్నారు. ముందుగా నరుకూరు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శంకరయ్యగౌడ్, సుబ్రహ్మణ్యంగౌడ్, చిరంజీవిగౌడ్, సుబ్బారావు, సురేంద్రబాబు, బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





కాంగ్రెస్ పార్టీలో నయా జోష్ కనిపించింది. పార్టీ శ్రేణుల్లో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. సాధిద్దాం సాధిద్దాం...ప్రత్యేక హోదా సాధిద్దాం నినాదాలతో తిరుపతి లోని ఎస్వీయూ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రత్యేక హోదా-న్యాయ సాధన సభ మార్మోగింది.కాంగ్రెస్‌తో పాటు సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ జెండాలు సభలో రెపరెపలాడాయి. పీసీసీ చీఫ్ షర్మిల ప్రసంగం పట్ల శ్రేణులు ఉత్సాహంగా కనిపించారు. 'మోడీ-కేడీ' అంటూ సభికులతో చెప్పించడం, జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోయాడంటూ 'రేవు దాటేంత వరకే ఓడ మల్లన్న, రేవు దాటిన తర్వాత బోడి మల్లన్న' సామెతను పలుమార్లు ఉటంకించడం, 'ఢిల్లీలో జగనన్న పిల్లి' అంటూ మాట్లాడిన సమయంలో కార్యకర్తలు చప్పట్లతో మారుమోగించారు.ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, కేంద్ర మాజీ మంత్రులు చింతా మోహన్, పల్లంరాజు, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, తులసిరెడ్డి,కనుమూరి బాపిరాజు,పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాంతియా కుమారి, ముఖ్య నాయకులు జేడీ శీలం, మయ్యప్పన్, రాకేష్,సునీల,వేణుగోపాల రెడ్డి, మాగంటి గోపాల రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, ప్రమీలమ్మ,చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భాస్కర్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాస రెడ్డి, తిరుపతి నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రామానాయుడు, సీపీఎం నేత గపూర్,ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు మణినాయుడు,నీరుగట్టు నగేష్, వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(తిలక్‌రోడ్)



న్యాయ సాధన సభకు హాజరైన జనం మధ్య రెపరెపలాడుతున్న కాంగ్రెస్, వామపక్షాల పతాకాలు-వేదికపై కాంగ్రెస్ నాయకులతో సీపీఐ,సీపీఎం నేతలు నారాయణ, గపూర్

కాంగ్రెస్‌లో నయా జోష్

ప్రత్యేక హోదా నినాదాలతో మార్మోగిన ఎస్వీయూ స్టేడియం

మునికోటి ఆత్మాహుతికి మోదీ సమాధానమేంటి?

ప్రత్యేక హోదా కోసం 2015లో కాంగ్రెస్ కార్యకర్త మునికోటి తిరుపతిలో ఆత్మాహుతి చేసుకున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ ఆ కుటుంబానికి ఏమి సమాధానం చెబుతారు? ఈ రాష్ట్రానికి ఏమి చెబుతారు? తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రత్యేక హోదా హామీ ఇచ్చిన మోదీ, వెంకన్నకే పంగనామాలు పెట్టాడు. నిజమైన భక్తులు ఇలా చేస్తారా? పదేళ్లపాటు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తాం.

- వైఎస్ షర్మిల, పీసీసీ చీఫ్




జగన్ ఢిల్లీలో ఎందుకు పోరాడరు?

కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే అక్కడి నాయకులు ఢిల్లీకి వచ్చి పోరాడుతున్నారు. జగన్మోహన్ రెడ్డి అలా ఎందుకు పోరాటం చేయడంలేదు? కేవలం లోపాయికార ఒప్పందాలే ఇందుకు కారణం. ఈ విషయం ప్రజలందరూ గమనించాలి. దేశంలో బీజేపీపై పోరాటం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి మాత్రమే.

- సచిన్ పైలెట్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి


దేవుడికే మోదీ పంగనామాలు



ప్రత్యేక హోదా కోసమే ఇండియా కూటమిలో చేరాం.హోదా కోసం ఏ పోరాటానికైనా కలిసి వస్తాం. దేశ ప్రజలకు భక్తితత్పరుడిగా కనిపించే మోదీ తిరుపతి దేవుడి సన్నిధిలో ఇచ్చిన మాటను తప్పి ఆ మూడు నామాల వాడికే పంగనామాలు పెట్టారు.బీజేపీ మతాన్ని ఆయుధంగా చేసుకుని విద్వేషాలను రెచ్చగొడుతూ దేశ విచ్ఛిన్నానికి పాటుపడుతోంది. కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వారికే రాయితీలను ఇస్తూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తోంది. మత సామరస్యం కోసం ఇండియా కూటమితో కలిసి పనిచేస్తాం.

- గపూర్, సీపీఎం నేత

వైఎస్ బొమ్మనే కనుమరుగు చేసిన జగన్



కేంద్ర హోంమంత్రిగా ఉన్న అమిత్‌షా గతంలో ఒక హత్య కేసు నుంచి బయటపడడానికి 12మందిని చంపాడు. వైఎస్ రాజశేఖర రెడ్డి బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఆయన ఫొటోనే కనుమరుగు చేశాడు. అధికారం కోసం వాడుకుని వదిలేయడం వైసీపీ, టీడీపీలకు పరిపాటిగా మారిపోయింది.కాబట్టే ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరిబయట పడేయండి.

- నారాయణ,సీపీఐ జాతీయ కార్యదర్శి

దేశ రాజకీయాల్లో గొప్ప మలుపు



తిరుపతి సభలో మూడు జెండాల కలయిక దేశ,రాష్ట్ర రాజకీయాల్లో గొప్ప మలుపు.కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు దూరం కావడంతోనే బీజేపీ పదేళ్లగా కేంద్రంలో అధికారంలో వుంది.ఇలాంటి తప్పిదాలకు ఇక తావు ఇవ్వకూడదు. రాష్ట్రానికి ఏడుగురు ముఖ్యమంత్రులను అందించిన రాయలసీమ నేడు కరువు కాటకాలతో అల్లాడిపోతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 130 స్థానాల్లో విజయం సాధిస్తుంది. షర్మిలే కాబోయే సీఎం.

-చింతామోహన్, కేంద్ర మాజీ మంత్రి

వైసీపీ తొత్తుల్లా ముగ్గురు సీఐలు

- శ్రీకాళహస్తి టీడీపీ నాయకులపై అక్రమ రౌడీషీట్లు తెరుస్తున్నారు
- న్యాయం చేయాలంటూ ఎస్పీకి పార్టీ నేతల ఫిర్యాదు



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి(నేరవిభాగం)/శ్రీకాళహస్తి, మార్చి 1: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ముగ్గురు సీఐలు వైసీపీ నాయకులకు కొమ్ముకాస్తూ టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు, రౌడీషీట్లు ఓపెన్ చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎస్పీ మలిక గర్గ్‌ను కోరారు.శుక్రవారం తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చిన టీడీపీ నాయకులు ఎస్పీని కలిశారు. పోలీసుల తీరు, అక్రమ కేసులు, రౌడీ షీట్లు, వేధింపుల గురించి ఆమెకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తి పార్టీ సమన్వయకర్త బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్, తొట్టంబేడు సీఐ శ్రీహరి, ఏర్పేడు సీఐ మల్లిఖార్జున్ వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, టీడీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదుచేయడమే కాకుండా రకరకాలుగా వేధిస్తున్నారన్నారు. ఏర్పేడు మండలంలో ఒకే కుంటుంబానికి చెందిన పి. ధనుంజయులు నాయుడు (67), చిరంజీవులు నాయుడు (69), పి. నాగరాజనాయుడు (52)తో పాటు పి. శివశంకర్‌రెడ్డి (69), మల్లిఖార్జున నాయుడు (62), బాబునాయుడు (58), కామాక్షి (46)పై రౌడీషీట్లు తెరిచారన్నారు.అయితే ఆ విషయం వారెవరికీ పోలీసులు ముందస్తుగా తెలియజేయలేదని చెప్పారు. మరో 42 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసేందుకు పోలీసులు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తనకు సమాచారముందని వెల్లడించారు. మండల, క్లస్టర్ స్థాయిలో ప్రధానమైన నాయకులను విచారణ పేరుతో స్టేషన్లకు పిలుస్తున్నారన్నారు.అధికారులు బయటకు వెళ్లిపోతూ ఎటువంటి విచారణ లేకుండా స్టేషన్‌లోనే కూర్చోబెడుతున్నారని చెప్పారు.రోజు రాత్రి ఎప్పుడో సీఐ వచ్చేవరకు నాయకులు స్టేషన్‌లోనే ఉండిపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల వేళ పార్టీ ప్రధాన నాయకులు ప్రచార కార్యకలాపాల్లో పాల్గొనకుండా చేసేందుకే పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వీటన్నింటి గురించి ఎస్పీకి వివరించామని, ఎస్పీ సానుకూలంగా స్పందించడంతో పాటు దర్యాప్తు చేసి కేసులు, రౌడీషీట్లు అక్రమమని తేలితే తీసేస్తామని హామీ ఇచ్చారని సుధీర్‌రెడ్డి చెప్పారు.రాష్ట్రంలోని టీడీపీ నాయకులందరూ కూడా తమపై రహస్యంగా కేసులు నమోదుచేసి రౌడీ షీట్లు ఏమైనా తెరిచారా అని చెక్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నియోజకవర్గ ఇంచార్జిలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇంచార్జి నరసింహయాదవ్, కోశాధికారి కంతా రమేష్,తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష,మీడియా ఇన్‌చార్జి శ్రీధర్‌వర్మ,శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో

పోలీసులు వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత శుక్రవారం ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.క్రియాశీలకంగా ఉన్న పార్టీ కార్యకర్తలను బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి రౌడీషీటర్, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి ఆదేశాలతో తన భర్త చంద్రబాబుపై 15 కేసులు పెట్టారని, ప్రతిపక్ష పార్టీలను అసభ్యపదజాలంతో దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జనసైనికులు గణేష్, చంద్రశేఖర్, శివకుమార్, బాలాజీ, రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

'చొక్కా చేతులు మడతపెట్టే సమయం ఆసన్నమైంది' అని జగన్ రెడ్డి పిలుపు ఇవ్వగానే వైసీపీ తమ్ముళ్లు సిద్ధం అయిపోయారు. అయితే ప్రత్యర్థుల మీద కాక, తమలో తామే కొట్టుకోవడం మొదలుపెట్టారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఇందుకు తాజా వేదికగా మారింది. పరస్పర ఆరోపణలు, విమర్శలతో రచ్చకెక్కిన వైసీపీలోని రెండువర్గాలు ఇప్పుడు ఏకంగా దాడులు, పోలీసుకేసులతో రాజకీయాలను రసవత్తరం చేస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



చొక్కాలు మడతపెడుతున్న జగనన్న తమ్ముళ్లు

- సూళ్లూరుపేట వైసీపీలో పరస్పర దాడులు

వేరు కుంపట్లతో మొదలై దాడుల దాకా...

సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి ఆరోపణలు, విమర్శలు, విడి సమావేశాలకు పరిమితమైన వైసీపీలోని రెండు వర్గాలు ఇప్పుడు అక్రమ దందాలను పరస్పరం అడ్డుకుంటున్నాయి. సూళ్ళూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట, ఓజిలి మండలాల్లో ఇసుక, గ్రావెల్ వంటి వనరులన్నింటినీ అధికార పార్టీ నేతలు ఇప్పటికే కరిగించేశారు. కేవలం పెళ్ళకూరు మండలంలో మాత్రమే వనరులు కొంతమేరకు మిగిలివున్నాయి. దాంతో అందరి చూపూ ఆ మండలంపై పడింది. నాయుడుపేట-రేణిగుంట సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నందున వాటిని సాకుగా చూపి గ్రావెల్ దోపిడీకి అధికార పార్టీ నేతలు రంగంలోకి దిగారు. మూడు నెలలుగా భారీఎత్తున గ్రావెల్ దోపిడీ జరుగుతోంది. గ్రామాల అభివృద్ధి పేరిట కొంత మొత్తం స్థానికులకు అందజేసి గ్రామస్థుల నోళ్ళు మూయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.అయితే శిరసనంబేడు గ్రామంలో తవ్వకాలకు గ్రామస్థులే అడ్డుపడ్డారు.కొండ కరిగిపోతోందని, గ్రావెల్ తరలింపు వాహనాలతో రోడ్లు పాడైపోతున్నదని అభ్యంతరాలు చెబుతూ గ్రామస్థులు బలంగా అడ్డుకోవడంతో తవ్వకాలు నిలిచిపోయాయి. తర్వాత రోశనూరు గ్రామం వద్ద గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. అక్కడ కూడా గ్రామస్థులు అడ్డుకున్నారు. అధికార పార్టీ నేతలు వినకపోవడంతో గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించి స్టే ఉత్తర్వులు తెచ్చి తవ్వకాలను నిలిపివేయించారు. చివరగా బంగారంపేట చెరువు నుంచీ గ్రావెల్ తవ్వి అక్రమంగా తరలించే పనిలో పడ్డారు ఎమ్మెల్యే అనుకూల వర్గ నేతలు. గురువారం సాయంత్రం తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి వైసీపీ నేత కళత్తూరు శేఖర్‌రెడ్డి వెళ్ళి అడ్డుకున్నారు. తవ్వకాలు జరుపుతున్న ఇటాచీ వాహనం తాళం లాక్కున్నారు. ఆ మండలానికి చెందిన డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి విషయం తెలిసి అనుచరులతో అక్కడికి చేరుకున్నారు. నాయుడుపేటకు చెందిన నాయకులకు ఇక్కడేమి పనంటూ శేఖర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. మాటామాటా పెరిగి చీకట్లో పరస్పరం కలబడి తోపులాడుకోవడంతో దుస్తులు కూడా చిరిగిపోయాయి. ఉద్రిక్తత నెలకొనడంతో సకాలంలో పోలీసులు చేరుకుని శేఖర్‌రెడ్డిని నాయుడుపేట స్టేషన్‌కు తరలించి తెల్లవారుజామున విడిచిపెట్టారు. గురువారం రాత్రి ఘటనలో దళితులపై దాడి చేశారంటూ శేఖర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆ కేసులో ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాయుడుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయం ఎదుట డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అనుచరులతో బైఠాయించారు. అధికార పార్టీకే చెందిన ఓ నేతను అరెస్టు చేయాలని మరో నేత స్టేషన్ ఎదుట బైఠాయించడంతో అధికార పార్టీ ఇరకాటంలో పడింది. పోలీసు అధికారులకు కూడా తలనొప్పిగా పరిణమించింది. చివరికి నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు ఇద్దరూ న్యాయం చేస్తామని సర్దిచెప్పడంతో సత్యనారాయణరెడ్డి ఆందోళన విరమించి వెనుదిరిగారు. ఈ వరుస పరిణామాలు సూళ్ళూరుపేట నియోజకవర్గంలో అధికార పార్టీకి ఊపిరాడకుండా చేస్తున్నాయి. ఎన్నికల షెడ్యూలు కూడా విడుదల కాక ముందే పరిస్థితి ఇలా వుంటే రానున్న ఎన్నికల నాటికి పార్టీ నేతల మధ్య అనైక్యత, పలువురు నేతల రాజీనామాలు అధికార పార్టీ పుట్టి ముంచుతాయని ఆ పార్టీ శ్రేణులే వాపోతున్నాయి.

వేమిరెడ్డి ఎఫెక్ట్

ఇంతకాలం అసంతృప్తి ఉన్నా పార్టీలోనే అణగి ఉన్న పలువురు నాయకులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి వైసీపీని వీడడంతో తిరుగుబాటు జెండా ఎగరేస్తున్నారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పలువురు వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు వేమిరెడ్డికి అనుచరులుగా వున్నారు. నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన వైసీపీ సీనియర్ నేతలు రాజశేఖరరెడ్డి, అనిల్ రెడ్డి, వారి అనుచరులైన ఎంపీటీసీ అల్లెమ్మ, సర్పంచ్ జ్యోతి తదితరులు మూడు రోజుల కిందట వైసీపీకి రాజీనామా చేశారు. ఆ వెంటనే మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అన్నమేడు మేజర్ పంచాయతీలో బాగా పట్టున్న వీరి చేరిక వైసీపీకి తీవ్ర నష్టం చేయనుంది. నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్, వైసీపీ సీనియర్ నేత రఫి కూడా మూడు రోజుల కిందట ఆ పార్టీకి రాజీనామా చేశారు. వేమిరెడ్డికి అనుచరుడైన రఫీకి పట్టణంలో చెప్పుకోదగిన ప్రజాబలముంది. ఆయన త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఇతడి నిష్క్రమణ సైతం వైసీపీకి గణనీయమైన నష్టం కలిగించనుంది. తాజాగా శుక్రవారం నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా రమణారెడ్డి, ఆయన సతీమణి, రెడ్డి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కట్టా సురేఖ వైసీపీకి, పదవులకు రాజీనామా ప్రకటించారు. అదే మండలం మర్లపల్లి సర్పంచ్ మంజులమ్మ, భర్త సీనియర్ వైసీపీ నేత రవీంద్ర కూడా అధికార పార్టీకి గుడ్‌బై చెప్పారు. వీరంతా త్వరలో టీడీపీలో చేరనున్నారు. ఈ వరుస రాజీనామాలు అధికార పార్టీని కుదిపేస్తున్నాయి. ఎన్నికల వేళ ఈ పరిణామాలు వైసీపీని తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నాయి.

మరింత ముదిరిన వైసీపీ వర్గపోరు

శేఖర్‌రెడ్డిని అరెస్టు చేయాలంటూ కామిరెడ్డి ఆందోళన



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన వైసీపీ శ్రేణులు

నాయుడుపేట టౌన్, మార్చి 1: అధికార పార్టీ వైసీపీలో వర్గపోరు మరింత ముదిరింది. పెళ్లకూరు మండలం బంగారంపేట వద్ద మట్టిని తరలిస్తున్న టిప్పర్లను వైసీపీ సీనియర్ నేత కళత్తూరు శేఖర్‌రెడ్డి తన వర్గీయులతో కలసి గురువారం అడ్డుకున్న విషయం తెలిసిందే. ఆ సమయంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి, కళత్తూరు శేఖర్‌రెడ్డికీ మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో దళితులపై శేఖర్‌రెడ్డి దాడి చేశాడంటూ సత్యనారాయణరెడ్డి నాయుడుపేట రూరల్ సీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కళత్తూరు శేఖర్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలంటూ శుక్రవారం సాయంత్రం కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు నాయుడుపేట పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దళితులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగదన్నారు. విచారించి న్యాయం చేస్తామని అర్బన్, రూరల్ సీఐలు శ్రీనివాసులురెడ్డి, జగన్‌మోహన్‌రావు చెప్పడంతో కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ధర్నాను విరమించి వెళ్లిపోయారు. కాగా, అసమ్మతి నేత, చెంగాళమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి ఇంటికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వెళ్లి మంతనాలు జరిపినట్లు సమాచారం. ఈ గొడవ సర్దుమణిగేలా చేయాలని ఎమ్మెల్యే కిలివేటి దువ్వూరును కోరినట్లుగా తెలిసింది.

షార్ కాంట్రాక్టర్ ఆత్మహత్య



నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 1: సూళ్లూరుపేట పట్టణంలోని బాపూజీ కాలనీలో నివాసం ఉంటున్న షార్ కాంట్రాక్టర్ వి.నాగేశ్వర రావు (55) శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసుల సమచారం మేరకు.... రాజమండ్రికి చెందిన నాగేశ్వరరావు గత 20 సంవత్సరాలు షైబడి షార్‌లో అనుసూయ ఇంజినీరింగ్ వర్క్స్ పేరుతో స్ట్రక్చరల్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నారు. బాలాజీ నగర్‌లోని సొంత ఇంట్లో తన వద్ద పనిచేస్తున్న వర్కర్స్ ఉంటుండగా ఆయన బాపూజీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఇటీవలే ఇంటిని కూడా అమ్మేసినట్లు తెలిసింది. శుక్రవారం అమ్మిన ఇంటిని రిజిస్ట్రేషన్ చేయాలని ఇంట్లో చెప్పి వెళ్లిన ఆయన బాలాజీ నగర్‌లో ఉన్న తన సొంత ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సిబ్బంది నాగేశ్వరరావు ఉరేసుకొని మృతి చెంది ఉండడాన్ని గమనించారు. వెంటనే ఆయన భార్యకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి భార్యను వివరాలడిగి తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

35 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

తడ, మార్చి 1: అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 35 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో తడలో అక్కంపేట వద్ద లారీలో తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని, డ్రైవర్ హరనాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో అక్కంపేటలోనే మరోచోట ఉన్న బియ్యాన్ని సైతం స్వాధీనం చేసుకున్నారు. రెండు చోట్ల ఉన్న 35,040 కేజీలు (సుమారు 35 టన్నులు) బియ్యాన్ని పౌరసరఫరాల గోదాముకు తరలించారు. రెండు లారీలు, ట్రక్ ఆటోను, డ్రైవర్ హరనాథ్, మరో ఇద్దరు వ్యక్తులను పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రామకృష్ణనాయక్, సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు, నగదు స్వాధీనం

గూడూరు, మార్చి 1: ఎటువంటి ధృవీకరణ పత్రాలు లేకుండా రైలులో అక్రమంగా తరలిస్తున్న 200గ్రాముల బంగారాన్ని, రూ.14.75లక్షల నగదును స్వాధీనం చేసుకుని ఇద్దరి అదుపులోకి తీసుకున్నట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నుంచి చెన్నై వెళుతున్న సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా నెల్లూరుకు చెందిన తులసీరామకృష్ణ, ఆసీస్ పాల్గాట్ అనే ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేశామన్నారు. వారి బ్యాగుల్లో ఎటువంటి రసీదులు లేని 200 గ్రాముల బంగారం, రూ.14.75లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నామన్నారు. తనిఖీల్లో సిబ్బంది జయప్రకాష్, వెంకటేశ్వర్లు, గణేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని కాంక్షించి టీడీపీకి అండగా నిలవండి



కరపత్రాలను అందజేస్తున్న సంధ్యారాణి

గూడూరు, మార్చి 1: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి ప్రజలందరూ రానున్న ఎన్నికలలో టీడీపీకి అండగా నిలచి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి కోరారు. శుక్రవారం స్థానిక తూర్పువీధిలో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న విధ్వంసపాలనతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. టీడీపీలోనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు, యువగళం పథకం ద్వారా యువతకు, అన్నదాత పథకం ద్వారా రైతులకు పలు సంక్షేమ పథకాలను అమలు పరిచేలా చంద్రబాబునాయుడు మినీమేనిఫెస్టోను రూపొందించారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, నరసింహులు, రవీంద్రరెడ్డి, తూపిలి సురేంద్ర, ప్రవీణ్, సుమన్, నయీమ్, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, జిలానిబాషా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేంద్రానివి... సోకులు వైసీపీవి: బీజేపీ



సంక్షేమ పథకాల క్యాలెండర్లు అందజేస్తుతన్న బీజేపీ నేతలు

నాయుడుపేట, మార్చి 1: రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేస్తుంటే, వైసీపీ ప్రభుత్వం సొంత సొంత పేర్లు పెట్టుకుని ప్రచారం చేసుకుంటోందని సూళ్లూరుపేట నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం నాయుడుపేటలో బస్టాండ్ ప్రాంతంలో బీజేపీ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ రంగినేని కృష్ణయ్య, కొప్పోలు సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ మురళి, ప్రధాన కార్యదర్శి సూరిబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో ప్రజాపోరు యాత్ర

గూడూరు, మార్చి 1: మండలంలోని చెన్నూరు గ్రామంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరుయాత్ర నిర్వహించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణమనాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బైరప్ప, గాలి ప్రకాష్‌నాయుడు, సురేష్‌బాబు, వెంకటేష్, గోపీకృష్ణ, హరికృష్ణ, కొండయ్య పాల్గొన్నారు.

వెంకటగిరి కమిషనర్‌గా అబ్దుల్ రషీద్



వెంకటగిరిటౌన్, మార్చి 1: వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బదిలీపై వెంకటగిరికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమణయ్య పెడన మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

గూడూరు ఎంపీడీవోగా రాజశేఖరరావు

గూడూరు, మార్చి 1: గూడూరు ఎంపీడీవోగా రాజశేఖరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సూపరింటెండెంట్ మురళి, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న రామచంద్ర నెల్లూరు జిల్లా జలదంకి మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తున్న రాజశేఖరరావు గూడూరుకు వచ్చారు.



ఎంపీడీవో రాజశేఖరరావుకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

బస్సు - ఆటో ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు

కోట, మార్చి 1: మండల పరిధిలోని చిట్టేడు వద్ద శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్సు - ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు... వాకాడు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు కోట నుంచి గూడూరుకు బయలుదేరింది. చేపల లోడుతో కోట వైపు వెళ్తున్న ఆటో చిట్టేడు వద్ద గెదెను తప్పించబోయి బస్సును ఢీకొంది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న కోటి, జానీ, బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోట ఆస్పత్రికి తరలించారు. కోటి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తీసుకెళ్లారు.

సమస్యలను ఎత్తిచూపితే కక్షసాధింపు చర్యలా: కురుగొండ్ల



కురుగొండ్లను సత్కరిస్తున్న మైనారిటీ నాయకులు

వెంకటగిరి, మార్చి 1: వార్డులో సమస్యలను ఎత్తి చూపితే వైసీపీ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడం దారుణమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 19వ వార్డు మాసాపేటలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ వార్డులో వీధిదీపాలు వెలగడంలేదని, కాలువలు శుభ్రం చేయడం లేదని, తాగునీటి సరఫరా జరగడంలేదని కురుగొండ్ల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల గురించి ప్రశ్నిస్తే స్థానిక వైసీపీ నాయకులు తమపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని చెప్పారు. ఇందుకు స్పందించిన కురుగొండ్ల మూడు నెలలు ఓపిక పట్టాలని, టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డులోని మైనారిటీ నాయకులు మాజీ ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, శ్రీరామదాసు గంగాధర్, కాపా శ్రీనివాసులు నాయుడు, సుబ్బా యాదవ్, బాషా, రవి, సుధ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో అందరికీ సముచితస్థానం: పాశిం



వైసీపీకి రాజీనామా చేసిన సర్పంచు, ఎంపీటీసీలతో సునీల్‌కుమార్

కోట, మార్చి 1: టీడీపీలో అందరికీ సముచిత స్థానం కల్పిస్తామని గూడూరు అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీ ప్రధాన కార్యదర్శి చిల్లకూరు దశరధరామిరెడ్డి, వంజివాక సర్పంచు పాముల అంకమ్మ, ఎంపీటీసీ ఎంబేటి శశి, పుచ్చలపల్లి సర్పంచు గోవర్ధనరెడ్డి వైసీపీకి, పార్టీ పదవులకు రాజీనామా చేసి జిల్లా అధ్యక్షునికి పంపుతున్నట్లు ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీన మాజీ సీఎం చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించారు. వీరిని మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ కలిసి మాట్లాడారు. టీడీపీలో చేరనున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పోలయ్య, మధుయాదవ్, చెంగల్‌రావు పాల్గొన్నారు.

టీడీపీలో పాత వారికి ప్రాధాన్యం



సమావేశమైన టీడీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 1: టీడీపీలో కొత్తగా ఎంతమంది చేరినా, కొత్తవారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి అశోక్‌రెడ్డి అన్నారు. నాయుడుపేట తుమ్మూరులో శుక్రవారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారితో ఇబ్బందులు ఉండవన్నారు. గత ఐదేళ్లుగా అరాచకపాలనతో ఇబ్బందులు పడ్డ ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో తగు బుద్దిచెబుతారన్నారు. అధికార పార్టీ ఇబ్బందులను ఎదుర్కొని వ్యయప్రయాసాల కోర్చి, కష్టనష్టాలు పడ్డ టీడీపీ శ్రేణులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, పుదూరు రత్నం, డి.శ్రీధర్‌రెడ్డి, డి.రామచంద్రారెడ్డి, ఎస్.జనార్ధనరెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి, వెంకటరమణారెడ్డి, చిట్టేటి చెంచయ్య, సుబ్బారావు, నవీన్, మస్తానయ్య, రమణయ్య, రత్నయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుండి ధర్నాను విజయవంతం చేయండి

గూడూరు, మార్చి 1: ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన విజయవాడలో నిర్వహించున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్, సాధారణ సెలవులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీవీ రమణయ్య, సురేష్, చంద్రయ్య, అశోక్, జాకీర్, నవీన్‌రెడ్డి, రాము, బాలు తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డిని కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ



ప్రభాకరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఫీ

నాయుడుపేట, మార్చి 1: రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ నెల్లూరులో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రఫీ పార్టీ సభ్యత్వానికి, వైస్ చైర్మన్ పదవికి రాజీనామ చేశారు. శనివారం నెల్లూరులో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సభ జరగనున్న దృష్ట్యా తన కార్యచరణ గురించి వేమిరెడ్డితో చర్చించారు. రఫీ వెంట న్యాయవాది పసల చెంగయ్య, హాజీ రహంతుల్లా సాహెబ్, శ్రీకాంత్, విజయ్, రవి, నిజామ్, తదితరులు ఉన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

చిల్లకూరు, మార్చి 1: ఈనెల 3వ తేదీన నిర్వహించే జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్లు షాలోమ్‌అరాఫత్, ప్రసూనాభానుమూర్తి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అంగన్వాడీ సిబ్బందికి, స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి పల్స్‌పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 5 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రవికుమార్, ఉమాపతి, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్‌పై సైబర్ కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 1: ఓ వలంటీర్‌పై తిరుపతి ఈస్ట్ పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. ఈస్ట్ ఎస్ఐ పురుషోత్తం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం, బయపల్లి వలంటీర్ జి.నాగేంద్రకు తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన ఓ యువతికి పరిచయస్తుడు. ఆ యువతికి పెద్దలు పెళ్లి నిశ్చయించారు. యువతి వివాహం చేసుకోబోతున్న యువకుడికి నాగేంద్ర ఆమె గురించి అసభ్యంగా సెల్‌ఫోన్ మెసేజ్ పెట్టాడు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు నాగేంద్రపై ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ యత్నం

కోట, మార్చి 1: మండల పరిధిలోని విద్యానగర్ సాయిబాబా గుడిసమీపంలో ఉన్న శ్రీనివాసులు ఇంట్లో చోరీ యత్నం జరిగిందంటూ శుక్రవారం స్థానికులు తెలిపారు. శ్రీనివాసులు కుటుంబసభ్యులు రెండు రోజులక్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. తెల్లవారుజామున ఇంటి తలుపులు పగలగొడుతున్న శబ్దం రావడంతో స్థానికులు గుర్తించి అలికిడి చేయడంతో దుండగులు పరారయ్యారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

వైసీపీని వీడుతున్నాం: రమణారెడ్డి



కట్టా రమణారెడ్డితో జనసేన నేత ఉయ్యాల ప్రవీణ్

నాయుడుపేట/నాయుడుపేట టౌన్, మార్చి 1: వ్యక్తిగత కారణాలతో వైసీపీకి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి తెలిపారు. పట్టణంలోని తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ రెడ్డి వెల్‌ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఉన్న తన సతీమణి కట్టా సురేఖా కూడా పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు రమణారెడ్డి తెలిపారు. అలాగే మండలంలోని మర్లపల్లి సర్పంచు మంజులమ్మ, రవీంద్ర దంపతులు కూడా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, వైసీపీకి రాజీనామా చేసిన ఆ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డిని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ కలిశారు. జనసేన పార్టీలో చేరాలని కోరారు.

ఆసరా చెక్కుల పంపిణీ

కోట, మార్చి 1: మండలంలోని 686 పొదుపు సంఘాల్లోని 6,778 మంది సభ్యులకు రూ5.38 కోట్ల చెక్కులను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే 282 మంది వలంటీర్లను షీల్డ్‌లు, మెమొంటోలతో అభినందించారు. కోటలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకరయ్య, ఏపీఎం రత్నయ్య, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ రెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల అందజేత

కోట, మార్చి 1: కోటలోని శ్యామసుందరపురం వద్ద ఉడిపాకల రామమ్మ జ్ఞాపకార్థం ఆమె తనయుడు సుబ్బారావు శుక్రవారం పేదలకు ఆహార పొట్లాలను సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

సామూహిక జన్మదిన వేడుకలు

గూడూరు, మార్చి 1: స్థానిక సరస్వతి శిశుమందిరంలో శుక్రవారం శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈనెలలో పుట్టినరోజు ఉన్న ఐదుగురు విద్యార్థుల చేత కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో రంగనాయకులు, మురళీరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో రాష్ట్రాభివృద్ధి


చిల్లకూరు, మార్చి 1: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ నాయకుడు పరిమల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం చిల్లకూరు గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు.

ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన

వెంకటగిరిటౌన్, మార్చి 1: ఈ-క్రాప్ మాసాయిదా జాబితాను ఆర్బీకేల వద్ద ఈనెల 3వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్లు ఏవో సుజాత శుక్రవారం తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

మద్యం మత్తులో సహోద్యోగితో గొడవే కారణం



లక్ష్మీనారాయణ

పాకాల, మార్చి 1: పాకాల పోలీస్ స్టేషన్‌లో మద్యం సేవించి సహోద్యోగితో గొడవపడిన హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను ఎస్పీ మలిక గర్గ్ శుక్రవారం సస్పెండ్ చేశారు. చాలాకాలంగా ఈయన మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు ఆరోపణలున్నాయి. గురువారం సాయంత్రం కూడా మద్యం సేవించి విధులకు హాజరై మరో హెడ్ కానిస్టేబుల్ మొగిలీశ్వరరెడ్డితో గొడవ పడ్డాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందడంతో ఎస్పీ విచారణ జరిపించారు. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భాకరాపేటలో పనిచేస్తున్న కానిస్టేబుల్ వెంకటరమణపై అవినీతి ఆరోపణలు రావడంతో బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. రెండురోజుల వ్యవధిలో ఇద్దరు సస్పెండ్ కావడం పోలీసుల్లో చర్చనీయాంశమైంది.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 1: ఏపీ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు(ఇంటర్మీడియట్), పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ప్రవేశపరీక్షలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని, ఈనెల 31వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. అలాగే డిప్లొమా పాలిటెక్నిక్ కోర్సుల కోసం నిర్వహించే పాలిసెట్‌కి ఏప్రిల్ 5వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. ఏపీఆర్‌జేసీ పరీక్ష ఏప్రిల్ 25, ఏపీపాలిసెట్ ఏప్రిల్ 27వ తేదీ నిర్వహిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802/03, 9399976999 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు...

వెంకటగిరి టౌన్, మార్చి 1: మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఈ నెల 3నుంచి మార్చి నెలాఖరు వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి అన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఆంగ్ల మాధ్యమం మాత్రమే బోధన ఉంటుందన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

గూడూరు, మార్చి 1: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ మేరీస్, డీఆర్‌డబ్ల్యూ, స్వర్ణాంధ్రభారతి, నారాయణ జూనియర్ కళాశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరిగాయి. 8:30 గంటల నుంచి పరీక్షాకేంద్రాల వద్ద సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పట్టణంలోని 5 కేంద్రాల్లో 1440 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1384 మంది హజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాలు కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కోట: పట్టణంలో అంబేడ్కర్ గురుకులం, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి.

వెంకటగిరి: పట్టణంలోని ఏపీఆర్‌జేసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బడి మలనాగయ్య జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమైయ్యాయి.

నాయుడుపేట: పట్టణంలోని అగ్రహారపేటలో ఉనన శ్రీవేమ జూనియర్ కళాశాల, ఎల్ఏ సాగరంలోని బాలుర గురుకులం, ఎస్‌పీజీసీ ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు.

ఎన్‌బీకేఆర్‌లో పరిగ్రాహ్ సదస్సు

కోట, మార్చి 1: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం పరిగ్రాహ్ 2024 జాతీయ సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు 70కి పైగా సాంకేతిక పత్రాలు సమర్పించారు. 20 పత్రాలను ఉత్తమమైనవిగా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుబ్బారెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌రెడ్డిని కలిసిన నెలవల విజయశ్రీ



సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న నెలవల విజయశ్రీ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 1: టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డిని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి టీడీపీ వి.యం సాధించేలా చొరవ తీసుకోవాలని వేనాటిని నెలవల కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నెలవల రాజేష్ పాల్గొన్నారు.

గోకులకృష్ణలో ప్రాంగణ ఎంపికలు

సూళ్లూరుపేట, మార్చి 1: సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాలలో బెంగళూరుకు చెందిన కోడెనెస్ట్ టెక్నాలజీస్ శుక్రవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. 65 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్ తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్, కోడెనెస్ట్ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధులు రిషి రంజన్, అర్జున్, అధ్యాపకులు అభినందించారు.

ప్రేమించలేదని యువతిపై కత్తితో దాడి



మహేష్

చంద్రగిరి, మార్చి 1: తనను ప్రేమించలేదన్న కోపంతో ఓ యువతిపై కత్తితో దాడి చేసిన యువకుడి వుదంతం కలకలం రేపింది.పోలీసుల కథనం మేరకు తల్లిదండ్రులు చిన్నవయసులోనే మృతి చెందండంతో చంద్రగిరి పట్టణంలో ఓ యువతి తన అమ్మమ్మతో అద్దె ఇంట్లో ఉంటూ, తిరుపతి సమీపంలోని ఓ కళాశాలలో నర్సింగు కోర్సు చదువుతోంది.ఈ క్రమంలో ఆమె ఇంటి కింది భాగంలో వుంటోన్న మహేష్‌తో పరిచయం ఏర్పడింది.అయితే మహేష్ మద్యం సేవిస్తూ జులాయిగా తిరుగుతున్నాడని తెలిసి ఆమె ఒకటిన్నర నెల క్రితమే మాట్లాడడం ఆపేసింది. దీంతో మహేష్ మద్యం సేవించి యువతి ఇంట్లోకి వెళ్ళి గొడవ చేశాడు.దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆ యువతి తరువాత చెన్నైలో ఉంటున్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్ళిపోయింది. బుధవారం రాత్రి ఆమె చెన్నై నుంచి వచ్చిందని తెలుసుకున్న మహేష్ మద్యం సేవించి ఇంట్లోకి చొరబడి కత్తితో ఆమెపై దాడి చేశాడు.ఆమె కేకలు వేయడంతో పరారయ్యాడు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విద్యాదీవెన నిధుల జమ

39,368మంది విద్యార్థులకు రూ.29.50కోట్ల లబ్ధి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 1: జిల్లాలో విద్యాదీవెన పథకంలో 39,368 మంది విద్యార్థులకు రూ.29.50కోట్లు జమ చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. 2023 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి చెందిన ఫీజు రీయింబర్స్ ఆర్థిక సాయాన్ని శుక్రవారం తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. జమ అయిన పదిరోజుల లోపు సంబంధిత కళాశాలలకు చెల్లించి సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు చెక్కును అందజేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు, అధికారులు హాజరయ్యారు.